


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 15-02-2023 సంపుటి : 04 సంచిక : 151 పేజీలు : 4 వెల : రూ 3-00


## 'ఆంధ్రప్రదేశ్ అని రాయడం కూడా రాని దద్దమ్మ లోకేష్'



తాడేపల్లి: టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేష్‌పై వైఎస్సార్‌సీపీ పార్టీ అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ రెడ్డి ఆసక్తికర కామెంట్స్ చేశారు. కనీసం ఆంధ్రప్రదేశ్ అని పేరు రాయడం కూడా చేతగాని వ్యక్తి లోకేష్ అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాగా, శివశంకర్ రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 'నారా లోకేష్ ఎక్కడ చదివాడు?. అతని క్లాస్‌మెట్స్ పేర్లు చెప్పమంటే ఎందుకు చెప్పటం లేదు?. చంద్రబాబు.. లోకేష్‌కు బూతులు నేర్పించి రోడ్డుపైకి వదిలారు. తండ్రీకొడుకులు ఇద్దరూ ఏ సబ్జెక్ట్‌పైనా 35 మార్కులు తెచ్చుకోలేరు. లోకేష్ భాష చూస్తుంటే సంస్కారం లేదని అర్థమవుతోంది. ఆంధ్రప్రదేశ్ అని రాయడం కూడా రాని చేతగాని దద్దమ్మ లోకేష్. అంతేకాకుండా లోకేష్ తన చెత్త హావభావాలతో ప్రజల్లోకి వచ్చాడు. అలాంటి లోకేష్ కూడా మాట్లాడటం విడ్డూరంగా ఉంది. చంద్రబాబు రెండు వేళ్లతో వెన్నుపోటు అని చూపించడం అందరికీ తెలుసు' అంటూ కౌంటర్ ఇచ్చారు.

## ఏపీ సీఐడీ మాజీ డీజీ పీవీ సునీల్ కుమార్ పై చర్యలు

### ఏపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి కేంద్ర హోం శాఖ లేఖ

అమరావతి ఫిబ్రవరి 14 ఏపీ సీఐడీ మాజీ డీజీ పీవీ సునీల్ కుమార్ పై చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి కేంద్ర హోం శాఖ లేఖ రాసింది. సునీల్ కుమార్ ఆధ్వర్యంలో సీఐడీ అధికారులు అక్రమ అరెస్టులు, కస్టోడియల్ టార్చర్‌కు పాల్పడుతున్నారని గతేడాది కేంద్ర హోంశాఖకు హైకోర్టు న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ లేఖ రాశారు. సీఐడీ విభాగంలో కొంతమంది అధికారులు వ్యవహరిస్తున్న తీరు ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే విధంగా ఉందని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన కార్యకర్తలపై అక్రమ కేసులు మోపుతున్నారని, అధికార పార్టీ నేతల ఆదేశాల మేరకే ఈ విధంగా చేస్తున్నారని హోంశాఖకు ఫిర్యాదు చేశారు. గతేడాది అక్టోబర్‌లో రాసిన లేఖపై కేంద్రహోంశాఖ కార్యదర్శి స్పందించారు. ఈరోజు పోస్టులో లక్ష్మీనారాయణ, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అధికారులు లేఖ పంపారు. కేంద్ర హోంశాఖ పంపిన లేఖలో ఫిర్యాదును పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

## పారదర్శకంగా పోలీసు శాఖ

### హోం మంత్రి వనిత

అమరావతి ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో జరిగిన మీడియా సమావేశంలో హోంమంత్రి తానేటి వనిత, హోం ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్ కుమార్ గుప్తా, గుంటూరు రేంజ్ డిఐజీ త్రివిక్రమ్ వర్మ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. హోం మంత్రి మాట్లాడుతూ ఈ రోజు పోలీస్ శాఖ లో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టడం జరిగింది. సీఎం జగన్ నేడు టూరిస్ట్ పోలీస్ స్టేషన్లను ప్రారంభించారు. రాష్ట్రంలో మహిళల భద్రతకు సీఎం జగన్ పెద్ద పీట వేశారని అన్నారు. మహిళల భద్రత కోసం దిశ చట్టం ను తీసుకువచ్చారు. ప్రస్తుతం దిశ చట్టం కేంద్రంలో పెండింగ్ లో ఉంది. అయినప్పటికీ మహిళల రక్షణ కోసం దిశ యాప్ ను తీసుకువచ్చాము. ఈ దిశ యాప్ ను 1 కోటి 30 లక్షల మందికి పైగా డౌన్లోడ్ చేసుకున్నారు. దిశ యాప్ ను వినియోగించి ఆపదలో ఉన్న దాదాపు 900 మంది మహిళలు రక్షణ పొందారు. గత ప్రభుత్వ పాలనలో కాల్ మని సెక్స్ రాకెట్ కు అనేక మంది మహిళలు బలయ్యారు. ఎమ్మార్వో వనజాక్షి, వైద్య



విద్యార్థి రిషితేశ్వరి లాంటి ఘటనలు అనేకం జరిగాయి. తాడేపల్లి ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం, పోలీసులు స్పందించారు. దాడికి పాల్పడిన నిందితుడిని గంటల వ్యవధిలో పట్టుకోవడం జరిగింది. బాధిత కుటుంబానికి 10 లక్షల రూపాయల నష్టపరిహారం ప్రభుత్వం ప్రకటించింది. తాడేపల్లి హత్య ఘటనను టీడీపీ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆమె ఆరోపించారు. నిందితుడు గంజాయి మత్తు లో అమ్మాయిని హత్య చేసాడని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. అది పూర్తిగా అవాస్తవం. వ్యక్తిగత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందని పోలీసుల విచారణలో తేలింది. జగనన్న పాలనలో ఏ సంఘటనలో కూడా నిందితులు తప్పించుకున్న సందర్భాలు లేవు. తప్పు చేస్తే సొంత పార్టీ వాళ్ళను కూడా వదిలిపెట్టొద్దని సీఎం జగన్ పోలీసు శాఖను ఆదేశించారు. తాడేపల్లి లో సీఎం నివాసం దగ్గర ఘటన జరిగిందని, రాజీనామా చేయాలని టీడీపీ నాయకులు ప్రచారం చేస్తున్నారు.

## 26 టూరిస్ట్ పోలీస్ స్టేషన్లను ప్రారంభించిన సీఎం జగన్



తాడేపల్లి: పర్యాటకుల భద్రతే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. పర్యాటక ప్రదేశాల్లో టూరిస్ట్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 26 టూరిస్ట్ పోలీసు స్టేషన్‌లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా జెండా ఊపి ప్రారంభించారు ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మరో మంచి కార్యక్రయం చేపట్టినట్లు తెలిపారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఎన్నో సంస్కరణలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. పోలీసులు మీ స్నేహితులే అనే భావనను తీసుకురాగలిగామని, ఇంతకుముందు జరగని రీతిలో పోలీస్ వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చినట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్లలో రిసెప్షనిస్టులు పెట్టి తోడుగా నిలిచే కార్యక్రమం చేపట్టామని అన్నారు. పర్యాటకుల భద్రత కోసమే ఈ టూరిస్ట్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 20 పర్యాటక ప్రాంతాల్లో టూరిస్ట్ పోలీస్ స్టేషన్లు ప్రారంభించినట్లు తెలిపారు. యాత్రికులు నిర్భయంగా పర్యాటక ప్రదేశాల్లో గడిపేందుకు ఈ పోలీస్ స్టేషన్లు ఉపయోగపడతాయని అన్నారు. టూరిస్ట్ పోలీస్ బూత్ అదేవిధంగా విశాఖ ఆర్కే బీచ్ రోడ్డులో ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీస్ బూత్ సీఎం జగన్ వర్చువల్‌గా ప్రారంభించారు. పోలీస్ బూత్‌తోపాటు 10 ద్విచక్ర వాహనాలు, రెండు పెట్రోలింగ్ వాహనాలను ప్రారంభించారు. నగరానికి వచ్చే పర్యాటకులకు మరింత భద్రత చేకూరేల బీచ్ పోలీసింగ్‌ను తీర్చిదిద్దారు.



## లింగమనేని రమేష్ మోసం చేశారు: చైతన్య గ్రూప్ ఛైర్మన్ బీఎస్ రావు



అమరావతి: చైతన్య గ్రూప్ ఆఫ్ కాలేజీస్ ఛైర్మన్ బీఎస్ రావు సంచలన ఆరోపణలు చేశారు. పారిశ్రామికవేత్త లింగమనేని రమేష్ తనను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చైతన్య విద్యా సంస్థల విస్తరణకు డబ్బు తీసుకున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. కాగా, బీఎస్ రావు మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. లింగమనేని రమేష్‌కు 2012-13లో రూ.310 కోట్లు ఇచ్చాం. చైతన్య విద్యా సంస్థల విస్తరణకు డబ్బు తీసుకున్నారు. లింగమనేని కావాలనే మమ్మల్ని మోసం చేశాడు. రమేష్ ఇచ్చిన 10 చెక్కులు చెల్లలేదు. లింగమనేని మోసాలపై హైదరాబాద్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశాం. ఆయన మోసాలపై ఆరు ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయి. తీసుకున్న డబ్బుకు మాకు న్యాయం చేస్తానని పెద్దల సమక్షంలో హామీ ఇచ్చారు. 2016లో ఎంవోయూ రాసి భూములు ఇప్పిస్తా అని హామీ ఇచ్చారు. కానీ, పైసా కూడా ఇవ్వలేదని అన్నారు.

## జగనన్న తడాఖా బాబుకు చూపిస్తాం: కొడాలి నాని

అమరావతి: ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సత్తా, తడాఖాను 2024 ఎన్నికల్లో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మరోసారి చూస్తారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరావు(నాని) వ్యాఖ్యానించారు. 175 నియోజకవర్గాల్లో గెలుపే ధ్యేయంగా గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి అన్ని చోట్లా విజయం సాధిస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్ చేతిలో చంద్రబాబు చావుదెబ్బ తినడం ఖాయమని, అంతటితో ఆయన రాజకీయ చరిత్ర ముగుస్తుందన్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు, లోకేశ్ తెచ్చిన జగనాసుర రక్తచరిత్రను ఎవరు చదువుతారు? ఆ పుస్తకాలు చలి మంటలు కాచుకునేందుకే పనికొస్తాయి. 'ఎన్టీఆర్‌ను తడిగుడ్డతో ఎలా గొంతు కోశారు?' అనే పుస్తకాన్ని వారు విడుదలచేస్తే జనం చదువుతారు. మామను పొట్టనబెట్టుకుంటే చంద్రబాబుకు ముఖ్యమంత్రి పదవి, పార్టీ అధ్యక్ష పదవి వచ్చింది. సీఎం జగన్‌కి వైఎస్ వివేకానందరెడ్డి చిన్నాన్న. ఆయన్ను ఎందుకు చంపుకుంటారు? వైఎస్ వివేకా చనిపోతే సీఎం జగన్‌కు ఏమైనా ఆస్తులొచ్చాయా? వివేకా ఆస్తులు ఆయన కుమార్తె, అల్లుడి పేరుమీదకు ఎలా వచ్చాయ్? వైఎస్ వివేకా అప్పట్లో వైఎస్ జగన్‌తో కలిసి నడిచి వచి?చన వ్యక్తి కాదు. వైఎస్ విజయమ్మపై కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓడించే ప్రయత్నం చేశారు. వైఎస్ జగన్ కుటుంబం నాశనమవ్వాలని కోరుకునే వ్యక్తులు వైఎస్ వివేకా ఫ్యామిలీలో ఉన్నారు. వైఎస్ భాస్కర్‌రెడ్డి కుటుంబమే సీఎం జగన్ వెంట నడిచింది.

## పల్నాడు జిల్లా లో రూ. 7 వేల కోట్లతో స్వదేశీ దర్శన్ కింద పనులు

### కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి

పల్నాడుఫిబ్రవరి 14 రూ. 7వేల కోట్లతో స్వదేశీ దర్శన్ కింద పనులు చేపడుతున్నామని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పల్నాడు జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 50 పర్యాటక కేంద్రాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. గండికోట ఫోర్ట్ లంబసింగి లో మ్యూజియంఏర్పాటు.. రాష్ట్రానికి పర్యాటక అభివృద్ధి కింద రూ. 120 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రూ.27.07 కోట్లతో అమరావతి అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. టూరిజం ప్రగతికి ప్రధాని మోదీ బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరిస్తున్నారని చెప్పారు. విద్యాసంస్థల్లో యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. దేవాలయాల్లో విద్యుత్ బిల్లుపై రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలని కోరుతున్నామని, కొన్ని దేవాలయలు కమర్షియల్‌గా మారాయని కిషన్ రెడ్డి విమర్శించారు. అది మంచి సంస్కృతి కాదని... కాశీ లాంటి ప్రాంతాలకు ప్రతి ఒక్కరు వెళ్లాలని కోరుకుంటారన్నారు. అందుకే పేదలు కాశీ వెళ్లడానికి కొన్ని రాయితీలు ఏర్పాటు చేస్తున్నామని కిషర్ రెడ్డి తెలిపారు.




## మోదీని 2002 నుంచి బీబీసీ వెంటాడుతోంది : అమిత్ షా



న్యూఢిల్లీ ఫిబ్రవరి 14 ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ని బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ 2002 నుంచి వెంటాడుతోందని కేంద్ర హోం మంత్రి, బీజేపీ నేత అమిత్ షా చెప్పారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, అదానీ-హిండెన్‌బర్గ్ నివేదిక మోదీ-బీబీసీ డాక్యుమెంటరీ వివాదాలపై స్పందించారు. ఏదైనా అంశంపై వేలాది కుట్రలు జరిగినప్పటికీ సత్యం కచ్చితంగా వెలుగులోకి వస్తుందని అమిత్ షా చెప్పారు. వారు(బీబీసీ) 2002 నుంచి మోదీని వెంటాడుతున్నారని, అయితే మోదీ ప్రతిసారీ మరింత బలపడి, మరింత ప్రజాదరణను పొందుతున్నారని తెలిపారు. నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా పని చేసిన కాలంలో (2002లో) గుజరాత్‌లో జరిగిన హింసాకాండపై దేశవిదేశాల్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ హింసాకాండకు సంబంధించిన అంశాలతో డాక్యుమెంటరీని బీబీసీ రూపొందించింది. ఈ డాక్యుమెంటరీని భారత దేశంలో అధికారికంగా ప్రసారం చేయలేదు. సామాజిక మాధ్యమాల్లో దీనిని ప్రసారం చేయవద్దని, దీనికి సంబంధించిన ట్వీట్లను తొలగించాలని కేంద్ర ప్రభుత్వం జనవరి 21న ఆదేశించింది. ఇది కేవలం ప్రచారాస్త్రమని కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది. ఈ డాక్యుమెంటరీపై నిషేధం విధించడాన్ని ప్రతిపక్షాలు నిరసించాయి. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ, ఈ డాక్యుమెంటరీని సమర్థించారు. సత్యం ప్రకాశిస్తుందని తెలిపారు. వెలుగులోకి వచ్చే దురలవాటు సత్యానికి ఉందన్నారు. నిషేధాలు, అణచివేతలు, బెదిరింపులు వంటివేవీ సత్యం బయటపడకుండా, దానిని కప్పిపెట్టి ఉంచలేవన్నారు. అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ నివేదిక దేశవిదేశాల్లో అల్లకల్లోలం సృష్టించిన సంగతి తెలిసిందే. దీనిపై సంయుక్త పార్లమెంటరీ సంఘం చేత లేదా న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని కాంగ్రెస్, టీఎంసీ, బీఆర్ఎస్ వంటి ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం వల్లే గౌతమ్ అదానీ అత్యంత వేగంగా అభివృద్ధి చెందారని ఆరోపించారు. ఆయన ప్రసంగంలోని కొన్ని భాగాలను రికార్డుల నుంచి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తొలగించారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసును కూడా జారీ చేశారు. ఈ వివాదంపై అమిత్ షా స్పందిస్తూ, ప్రభుత్వం దాచవలసినది ఏమీ లేదన్నారు. ప్రస్తుతం దీనిని సుప్రీంకోర్టు విచారిస్తోందని, ఈ సమయంలో దీనిపై తాను మాట్లాడటం ఓ మంత్రిగా తనకు సరికాదని అన్నారు. అయితే ఈ విషయంలో దాచడానికేమీ లేదని, భయపడవలసినదేమీ లేదని తెలిపారు. రాహుల్ గాంధీ ఏం మాట్లాడాలని అనుకుంటున్నారో ఆయన లేదా ఆయన ప్రసంగాలను రాసేవారు ఆలోచించుకోవాలన్నారు. బీజేపీ క్రోనీ కేపిటలిజానికి పాల్పడుతోందని గాంధీ చేసిన ఆరోపణలపై స్పందిస్తూ, ఇప్పటి వరకు బీజేపీపై ఇటువంటి ఆరోపణలను ఎవరూ చేయలేదన్నారు. కాంగ్రెస్ పాలనా కాలంలో జరిగిన అవినీతిపై కాగ్ సీబీఐ కేసులను నమోదు చేశాయన్నారు. డాక్యుమెంటరీపై కేంద్రం నిషేధంగుజరాత్ అల్లర్లు, మోదీ పాత్రపై బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీని ప్రసారం చేయవద్దని జనవరి 21న కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్, 2021 ప్రకారం ఈ అత్యవసర ఆదేశాలను జారీ చేసింది. యూట్యూబ్, ట్విటర్ల నుంచి ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన లింకులు, వీడియోలను తొలగించాలని ఆదేశించింది. ఈ డాక్యుమెంటరీ నిష్పక్షపాతంగా లేదని పేర్కొంది. వలసవాద ఆలోచనా ధోరణి కనిపించిందని పేర్కొంది.


# సంపాదకీయం

బుధవారం 15-02-2023

## మాటలే కానీ చేతలు ఉండవా...

పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రతి అంశంపై చర్చించడానికి తాము సిద్ధమని కేంద్ర ప్రభుత్వం చెబుతుంది. కానీ సభలు ప్రారంభమైన తర్వాత అలాంటి సుహృద్భావ వాతావరణం మాత్రం కనపడదు. మోడీ రెండోసారి ప్రధానమంత్రి అయిన తర్వాత ఈ ధోరణి మరింత పెరిగింది. ప్రతిపక్షాలు ఎంత గందరగోళం రేకెత్తించినా తమకు అవసరమైన బిల్లులను ఆమోదింపచేసుకోవడం ప్రభుత్వానికి ఆనవాయితీగా మారింది. అదానీ గ్రూప్ అవకతవకలపై చర్చ జరగాలని ప్రతిపక్షాలు పట్టుబట్టడంలో తప్పులేదు. అదానీ వ్యవహారంపై చర్చించాలన్న ప్రతిపక్షాల న్యాయమైన డిమాండ్‌ను మోడీ ప్రభుత్వం అంగీకరించడం లేదు. అదానీ గ్రూప్ వ్యవహారాన్ని చర్చించాలని పట్టుపట్టడంలో దాదాపు ప్రతిపక్షాలన్నీ ఒకే వైఖరి అనుసరిస్తున్నాయి. ఈ వ్యవహారంపై దర్యాప్తు చెయ్యడానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ జె.పి.సి ఏర్పాటు చెయ్యాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. జె.పి.సి ఏర్పాటు చెయ్యడం కొత్త కాదు. అందులో ప్రతిపక్షాలకన్నా అధికారపక్ష సభ్యులే ఎక్కువగా వుంటారు. మన పార్లమెంట్ చరిత్రలో ఇప్పటివరకు ఆరుసార్లు జె.పి.సి ఏర్పాటు చేశారు. ఈ దర్యాప్తులో అనేక అంశాలు చర్చకు వస్తాయి. వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలుస్తాయి. జెపిసి అంటే ఎందుకు అంత భయం అదానీ-మోడీ అనుబంధ లీలలు ప్రజలకు తెలుస్తాయని భయమా అందుకే ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో అదానీ గ్రూప్ అవక తవకలపై, కుంభకోణంపై చర్చించాలని పట్టుబడుతున్నాయి. ఈ అంశం దేశం మొత్తాన్నికలిచి వేస్తున్నా ప్రధాని నరేంద్ర మోడీ నోరు విప్పకపోవడం బాధ్యతా రాహిత్యం. అదానీ కుంభకోణంలో ప్రజాధనం దోపిడీకి గురైంది కాబట్టి ఈ అంశాన్ని చర్చించాలని ప్రతిపక్షాలు గట్టిగా పట్టుబడుతున్నాయి. అదాని లాంటి బడా సంస్థలు అక్రమాలకు పాల్పడి ప్రజలను కోలుకోని విధంగా నష్టపరచినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కార్పొరేట్లకు అనుకూలమైన నిర్ణయాలు మాత్రమే మోదీ ప్రభుత్వం తీసుకొన్నది. ఈ పరిణామాలు భారతదేశ ప్రతిష్టను దెబ్బతీసేవిగా ఉన్నాయి. అదానీ గ్రూప్ కుంభకోణంపై ప్రపంచం అంతా గగ్గోలు పెడుతున్నప్పటికీ మోడీ నోరు మెదపడం లేదు. అదానీ వ్యవహారంపై ప్రతిపక్షాలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి బదులు ప్రధాని మోదీ లోక్‌సభలో ఎదురుదాడికి దిగడం దురదృష్ట కరం.అంతేకాదు, ప్రతిపక్షాలు ఎంత తీవ్రమైన సమస్యను లేవనెత్తినా వారికి జవాబివ్వనవసరం లేదని ప్రభుత్వంలో ఉన్నవారు భావించే పరిస్థితి ఏర్పడింది. సభలో అన్నిటికంటే ముందుగా దేశంలో పెరుగుతున్న ధరలు, జీఎస్టీ పెంపు, నిరుద్యోగం లాంటి అంశాలపై చర్చించి జవాబివ్వాలని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌ను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రతిపక్షాలన్నా, వారి నిరసనలన్నా ప్రభుత్వానికి లెక్కలేకుండా పోయింది. అసలు వారితో చర్చించడమే అనవసరమని ప్రభుత్వం భావిస్తోంది.కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో సమస్యలపై సమగ్రంగా చర్చించడానికి అంగీకరించదు. గత తొమ్మిదేళ్లుగా ఇదే పద్ధతి కొనసాగుతోంది. ఏ విషయం లోను ప్రతిపక్షాలను పరిగణనలోకి తీసుకోవడం లేదు. అమెరికాలోని హిడెన్ బర్గ్ పరిశోధనా సంస్థ కార్పొరేట్ దిగ్గజం గౌతం అదానీ గ్రూపు పాల్పడిన అక్రమాలు, అవకతవకలు, మోసాలు వెల్లడించడం చూసి ప్రపంచమే కంగుతిన్నది. ప్రపంచంలోనే అతి పెద్ద కుబేరుల్లో రెండవ పెద్ద సంపన్నుడిగా అమెరికా పత్రిక ఫోర్బ్సుకూడా గత ఏడాది ప్రకటించింది. ఎల్ఐసీ, ఎస్‌బీఐ ఇతర ప్రభుత్వ ఆర్థిక సంస్థల వద్ద వేలాదికోట్ల రూపాయల రుణాలు తీసుకొని స్టాక్‌మార్కెట్‌లో పెట్టడం, దొంగ కంపెనీలను సృష్టించడం, లెక్కల్లో మోసాలకు పాల్పడినట్లు వెల్లడించింది. అమెరికా ఆర్థిక దర్యాప్తు సంస్థ హిండెన్‌బర్గ్ నివేదిక కూడా అదాని బండారం బట్టబయలుచేసింది. అదానీ గ్రూపు అక్రమాలపై పార్లమెంట్‌లో చర్చించడానికి బీజేపీ ప్రభుత్వం అనుమతించకుండా ప్రజాస్వామ్య వ్యవస్థనే అపహాస్యం చేస్తుంది. ఇంతటి తీవ్రమైన భారీ కుంభకోణంపై పార్లమెంటులో చర్చించే సమయంలేదు

# కమలానికి డేంజర్ బెల్స్..



విజయవాడ, ఫిబ్రవరి 14,రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమిని చవిచూసే అవకాశముంది. టీడీపీ, జనసేన, వామపక్షాలు కలిసి పోటీ చేస్తే 120 సీట్లు సాధించవచ్చు. అదే టీడీపీ, జనసేన, బీజేపీ కలిస్తే ఓడిపోవచ్చు. కేవలం టీడీపీ, జనసేన కలిస్తే వైసీపీతో గట్టి పోటీ ఉంటుంది!" అంటూ ఇటీవల శ్రీ ఆత్మసాక్షి సర్వే వెల్లడించింది. రాష్ట్ర ప్రజలపై ఊపిరి సలపని విధంగా భారాలు మోపడానికి కేంద్రంలోని బీజేపీ సర్కారే కారణమని ఈ సర్వే చెబుతోంది.కేంద్రానికి అంటకాగుతున్న వైసీపీ ప్రభుత్వం అందుకు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించింది. విపక్ష టీడీపీ, జనసేన పార్టీలు కమలనాధులతో కలిస్తే పుట్టగతులుండవని చెప్పకనే చెప్పేసింది. కేంద్ర ప్రభుత్వ అధీనంలో పనిచేసే ఈడీ, సీబీఐ, ఈసీ, ఐటీలను చూస్తే అధికార, విపక్షాలకు వణుకు పుట్టొచ్చు. జనసేన భయపడాల్సిన అవసరమేముందని ఆ పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.విద్యుత్?రంగ సంస్కరణల్లో భాగంగా ఉ

### సర్వేలు ఏం చెబుతున్నాయి...

త్పత్తి, పంపిణీని పూర్తిగా ప్రైవేటుపరం చేయాలని కేంద్రం నిర్దేశించింది. దీనికి తందానా అంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిదాకా ఇస్తోన్న రాయితీలను వదిలించుకోవడానికి సిద్ధమైంది. 200 యూనిట్ల వరకూ ఉచితంగా ఎస్సీ ఎస్టీలకు ఇచ్చే పథకానికి కొర్రీలు వేస్తోంది. నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు ఇచ్చే రాయితీకి మంగళం పాడుతోంది. వ్యవసాయానికి ఇచ్చే ఉచిత కరెంటుకు ఎసరు పెట్టేందుకు మీటర్లు బిగించింది.వైఎస్సార్? జల కళ పథకం కింద ఉచితంగా వేసే బోర్లను నిలిపేసింది. ట్రూ అప్?చార్జీల పేరుతో జనానికి షాకులు మీద షాకులు ఇస్తోంది. ఇవి చాలవన్నట్లు థర్మల్?విద్యుత్?కేంద్రాలను అదానీ పరం చేసేందుకు సిద్ధమైంది. వీటికి అవసరమైన బొగ్గును టన్ను రూ.5 వేలకు బదులు విదేశాల్లోని అదానీ బొగ్గు గనుల నుంచి సుమారు రూ.25 వేల లెక్కన దిగుమతి చేసుకోవడానికి అంగీకరించింది. ఇవన్నీ ఒక లెక్కయితే రేపో మాపో ప్రీపెయిడ్?స్మార్ట్?మీటర్ల భారాన్ని ప్రజల నెత్తిమీద మోపేందుకు కసరత్తు చేస్తోంది.రాష్ట్ర ప్రభుత్వం అప్పులకు అనుమతి కోరినప్పుడల్లా కేంద్రం షరతులు విధిస్తోంది. షరతుల్లో భాగంగానే విద్యుత్, అర్బన్?సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. చెత్తమీద పన్నులు వేయడం, ఆస్తి విలువ ఆధారిత పన్నులు వేయడం, మంచినీటి కుళాయిలకు మీటర్లు బిగించి నీళ్ల అమ్మకానికి తెరదీయడం ఈ తంతులో భాగమే.ఇంటి పన్నులు పెరగడంతో అద్దెలు కూడా ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. దీంతో ప్రభుత్వాలు విధించే భారాలకు తోడు ఇంటి అద్దెలు భరింపశక్యంకాని స్థితికి చేరుకున్నాయి. ఇవన్నీ తమకు సంబంధం లేదని కేంద్రంపై నెట్టినా అమలు చేస్తోంది రాష్ట్ర ప్రభుత్వమే అయినందున ఆ సెగ వైసీపీకి తగలకపోదు. రాష్ట్రానికి విభజన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదు. ప్రత్యేక హోదా లేదు. విశాఖ రైల్వే జోన్?లేదు. ఉన్న వాల్తేరు డివిజన్‌ను ఎత్తేసింది. కడప స్టీల్?ప్లాంటును కేంద్ర సర్కారు నెలకొల్పాలి. దీనికి కొర్రీ వేసి రాష్ట్ర ప్రభుత్వం జిందాల్‌తో కలిసి ఏర్పాటు చేసేందుకు పావులు కదిపింది. రామాయపట్నంలో భారీ పోర్టును కేంద్రం నిర్మించాలి. దీన్ని సీఎం జగన్?తాబేదారుతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం మైనర్?పోర్టును నిర్మించేట్లు చేశారు.పోలవరం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినా సకాలంలో అవసరమైన మేర నిధులు ఇవ్వకుండా కేంద్ర సర్కారు కొర్రీలు వేస్తోంది. 2024 నాటికి ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయడం కుదరదని చెప్పినా అధికార విపక్షాల్లో కించిత్తు రోషం లేదు. ప్రజలు త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంటును విక్రయిస్తున్నట్లు కేంద్రం కరాఖండిగా తేల్చి చెప్పింది. అయినా అధికార, ప్రతిపక్షాలు ఉత్తుత్తి విమర్శలతో ఉత్తరాంధ్ర ప్రజలను మభ్య పెడుతున్నాయి.ఇవన్నీ ఒక ఎత్తయితే బీజేపీ ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టడాన్ని ముస్లిం మైనార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రాష్ట్రంలో బీజేపీ వ్యతిరేక పార్టీల వైపు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ముస్లింలు, క్రైస్తవుల్లో నిరంతరం పెరుగుతున్న అభద్రతకు కారణమవుతున్న బీజేపీకి మూడు ప్రధాన పార్టీలు అంటకాగడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.ప్రజలు చీదరించుకుంటున్న బీజేపీని భుజాల మీద మోస్తోన్న వైసీపీ సర్కారుపై ప్రభావం తీవ్రంగా ఉ ంటుంది. కమలనాధులతో పొత్తు పెట్టుకున్న జనసేనకూ ప్రజల నుంచి నిరసన సెగలు తప్పేట్టు లేవు. ఇప్పటికీ టీడీపీ గోడ మీద పిల్లివాటంగా కేంద్ర విధి విధానాలపై మాట్లాడకుండా అన్నింటినీ జగన్‌పై తోసేస్తోంది టీడీపీ, జనసేన, బీజేపీ కలిస్తే ఓటమి తప్పదని శ్రీ ఆత్మసాక్షి సర్వే వెల్లడించింది. టీడీపీ, జనసేన కలిసి కేంద్ర సర్కారు విధి విధానాలను తూర్పారబట్టకుండా, వాటిని మోస్తున్న వైసీపీ మీదనే గురిపెట్టినా గెలుపు అంత తేలిక్కాదని ఈ సర్వే వెల్లడించింది.

# సిక్కోలులో ఏనుగుల బీభత్సం



శ్రీకాకుళం, ఫిబ్రవరి 14, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఏనుగులు పంటలను నాశనం చేయడమే కాకుండా ప్రజలపై దాడి చేస్తూ ప్రాణాలను తీస్తున్నాయి. ఏనుగుల గుంపు గ్రామాల వైపు రాకుండా జిల్లాకు చెందిన 13 మంది ట్రాకర్లతో విధులు నిర్వహిస్తున్నారు. వీరు ఏనుగులు గ్రామం వైపు రాకుండా చూసే క్రమంలో వాటి బారిన పడి గాయాల పాలవ్వడం ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు కూడా ఉన్నాయి. ఇటీవల భామిని మండలం పసుకుడిలో ఓ ట్రాకర్ పై ఏనుగులు దాడి చేసి తొక్కి చంపేశాయి. ఆ ట్రాకర్ పాతపట్నం మండలం తిమికి చెందిన ఆదినారాయణ అనే గిరిజనుడు. దీనిపై జాతీయ ఎస్టీ కమిషన్ సీరియస్ గా తీసుకుంది. సుమోటోగా కేసు నమోదు చేయడమే గాకుండా ఉన్నతాధికారులతో పాటు శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కు ఈ వ్యవహారంపై జాతీయ గిరిజన కమిషన్ రిసెర్చ్ అధికారి అంకిత్ కుమార్ సేన్ పేరిట నోటీసు జారీ అయింది. అటవీ శాఖ ప్రిన్సిపల్ ఛీఫ్ కన్జర్వేటర్ వై.మధుసూధన రెడ్డి, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకార్కు తాజాగా నోటీసులు పంపారు. ఎవరి నిర్లక్ష్యం వల్ల ట్రాకర్ మృతి చెందారన్న దానిపై వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని కోరడం ఇప్పుడు అధికారుల్లో చర్చనీయాంశం అయింది. అటు గిరిజనులు కూడా అధికారుల తీరుపై విమర్శలు చేస్తున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు రక్షణగా ఉన్న ట్రాకర్ మృతి చెందితే కనీసం ఆ కుటుంబానికి తగిన గౌరవం ఇవ్వలేదంటూ ఆరోపిస్తున్నారు. దహన సంస్కారాల రోజు కూడా ఆ శాఖాధికారులు పెద్దగా పట్టించుకోలేదని ఆదివాసీ వికాస పరిషత్ ప్రతినిధి వాబ యోగి ఆరోపించారు. అదే ప్రభుత్వ ఉద్యోగి అయితే ఇలానే చేసి ఉండేవారా అని ప్రశ్నిస్తున్నారు. ఏనుగుల దాడిలో మృతి చెందితే కేవలం రూ.5లక్షలు ఇచ్చి చేతులు దులుపు కోవడం తగదని అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఇద్దరు ట్రాకర్లు చనిపోయారని, వారు కూడా గిరిజనులేనని తెలిపారు. వారి కుటుంబాలను కూడా పాలకులు పరామర్శించి ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. తక్షణమే ఆయా కుటుంబాలకు ఎక్స్ గ్రేషియాగా రూ.50 లక్షలు ఇవ్వాలని, ఆయా కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.భామిని మండలంలో పది ఏనుగులు ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా అయిన భామిని మండలంలో తిష్ట వేసి బీభత్సం సృష్టిస్తున్నాయి. 2007లో వచ్చిన ఏనుగుల గుంపులో మిగిలిన నాలుగు ఏనుగులు పసుకుడి పరిసర ప్రాంతాల్లో ఉండగా, గత వారం ఒడిశా అటవీ ప్రాంతం నుంచి వచ్చిన మరో ఆరు ఏనుగులు తివ్వకొండల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ ఏనుగుల వల్ల పక్కుడి బద్ర, నేరడి గ్రామానికి చెందిన రైతుల పంటనష్టాలను చవిచూశారు. గతంలో తిష్ట వేసిననాలుగు ఏనుగుల గుంపును ఒడిశాలోని లభేరీ అడవులకు తరలించాలని బాధిత రైతులు, గిరిపుత్రులు డిమాండ్ చేస్తున్నారు. ధర్నాలు, రాస్తారోకోలు కూడా చేవారు. ఇప్పటి వరకు ఈ ఏనుగులతో పాలకొండ డివిజన్లో 14మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. ఇక పంట నష్టాలైతే కోట్ల రూపాయల్లోనే ఉంటుంది. వన్యప్రాణ రక్షణ చట్టం మేరకు అటవీశాఖాధికారులు ఏనుగులకు రక్షణ కల్పిస్తునే రైతుల పంటలు నష్టపోకుండా చూడాల్సివున్నా అటువంటి చర్యలేవీ చేపట్టడం లేదు. వాటిని ఒడిశా లభేరి అడువులకు లేకుంటే జూకైన తరలించాలని రైతులు, గిరిజనులు కోరుతున్నారు. నష్టపోయిన పంటలకు పరిహారం అందించేలా చూడాలని వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవల భామిని మండలం తాలాడ గ్రామంలో ఏనుగుల దాడి వల్ల గోరుచిట్టె చిన్నారావు మృతి చెందాడు. ఆ కుటుంబానికి పరిహారం ఇచ్చి ఆదుకున్నారు. అయితే చనిపోయిన చిన్నారావు కుటుంబానికి 25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఎం డిమాండ్ చేస్తోంది. ఏనుగులను తరలించాలని మంత్రులకు, ఫారెస్టు అధికారులకు ఎన్ని విజ్ఞప్తులు చేస్తున్నా ఫలితం లేదని ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్లక్ష్య ధోరణి విడనాడి ఏనుగులను తరలించేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని మృతుల కుటుంబాలకు ఒక ఉద్యోగం, ఎక్స్ గ్రేషియా, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రు.30వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.పాతపట్నం మండలం తడిమి గ్రామానికి చెందిన ఆదినారాయణ అనే ట్రాకర్ పసుకుడిలో ఏనుగుల దాడితో మృతి చెందాడు. గజరాజులను రక్షించడంతోపాటు ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా ట్రాకర్ గా విధులు నిర్వహిస్తుండగా అవి తొక్కేయడంతో ప్రాణాలు విడిచాడు. ఆదినారాయణ అంత్యక్రియలు గౌరవ ప్రదంగా నిర్వహించలేదు. ట్రాకర్గా విధులు నిర్వహి స్తున్న వారిలో అధిక మంది గిరిజనులే ఉన్నారు. పాల కులు వారిని ఆదుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. పసుకుడిలో బాధితుడి కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్ గ్రేషియో చెల్లించడంతో పాటు ఉద్యోగం ఇవ్వాలి. రెండు ఎకరాల భూమి మంజూరు చేయాలి. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నవారికి ముందస్తుగా ప్రభుత్వమే బీమా చెల్లించాలి. పసుకుడి వ్యవహారంపై ఎస్టీ జాతీయ కమిషన్ కూడా సుమోటోగా కేసు నమోదు చేయడం కొండంత ధైర్యం కలిగించింది.

# జీవీఎల్ ఎందుకో ప్రేమ...



విశాఖపట్టణం, ఫిబ్రవరి 14, విశాఖ లోక్‌సభ స్థానంపై కన్నేసిన బీజేపీ రాజ్యసభ సభ్యుడు జివిఎల్ నరసింహారావు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా ఆయన జీరో అవర్‌లో వంగవీటి మోహన రంగా పేరును రాజ్యసభలో ప్రస్తావించారు. విజయవాడ ఎయిర్ పోర్ట్‌కు రంగా పేరు పెట్టాలని, ఏపీలో ఏదొక జిల్లాకు రంగా పేరు పెట్టాలని, రంగాను కొందరు ద్రోహులు హత్య చేశారని పార్లమెంటులో ప్రకటించారు.జివిఎల్‌కు హఠాత్తుగా వంగవీటి రంగా, కాపులపై ప్రేమ ఎందుకు పుట్టుకొచ్చిందే బీజేపీ నేతలకు కూడా అంతు చిక్కడం లేదు. జివిఎల్‌కు కాపులు ఎందుకు సన్మానాలు చేస్తున్నారని గత వారం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ కూడా అసహనం వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో తరచూ కాపుల గురించి జివిఎల్ ప్రస్తావించడం వెనుక వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది.విశాఖపట్నం లోక్‌సభ స్థానం నుంచి వచ్చే సాధారణ ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న జివిఎల్ అక్కడి ఓటు బ్యాంకును తనకు అనుకూలంగా మార్చుకునేందుకు తంటాలు పడుతున్నారు.జివిఎల్ నరసింహారావు ప్రజల్లో బాగా గుర్తింపు ఉన్న నాయకుడేమి కాదు. బీజేపీ పెద్దలతో ఉన్న పరిచయాలతో పాటు ఎన్డీఏ హయంలో వాజ్‌పాయ్, అద్వానీల కాలంలో బీజేపీ నేతలతో ఉన్న పరిచయాలతో రాజ్యసభ సభ్యుడైపోయారు. 2004కు ముందు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వారిలో జివిఎల్ కూడా ఉన్నారు. ఆ తర్వాత బిజెపి ముఖ్యమంత్రులకు ప్రచార బాధ్యతలు నిర్వహిస్తూ ఉత్తరాదిలోనే ఎక్కువ కాలం గడిపేశారు.మోడీ ప్రధానమంత్రి అయ్యాక అదృష్టం కలిసొచ్చి ఎంపీ పదవి వరించిన వారిలో జివిఎల్ కూడా ఒకరు. మరోసారి రాజ్యసభను సభ్యత్వాన్ని పునరుద్ధరించే అవకాశాలు కష్టమని బీజేపీ నేతలే చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఏపీలో సొంతంగా బీజేపీ పోటీ చేయాల్సిందేనని జివిఎల్‌కు కూడా ఆ పార్టీ అగ్ర నాయకత్వం తేల్చి చెప్పేసింది. దీంతో విశాఖ ఓటర్ల మనసు గెలుచుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో బీజేపీలో విశాఖ స్థానానికి పురంధేశ్వరి నుంచి పోటీ ఎదురవుతుందని భావించి ఆమెను పోటీలోకి రాకుండా రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు.ముందు నుంచి తానే విశాఖలో పోటీ చేస్తానని లీకులిస్తున్నారు. విశాఖలో కాపు ఓటర్లు గణనీయంగా ఉండటంతో వారిని మెప్పించే ప్రయత్నాలు జోరుగా చేస్తున్నారు. జివిఎల్ ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో ఎన్నికల వరకు ఎదురు చూడాల్సిందే.

# నిజమైన వాలెంటైన....

ఒరిస్సా, ఫిబ్రవరి 14, యాసిడ్ దాడి నుండి బయటపడిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు గొప్ప మనసున్న ఓ యువకుడు. రౌల్ రాణి అనే యువతిని సరోజ్ సాహు అనే యువకుడు ప్రేమ వివాహం చేసుకున్నాడు. 2009 మే 4న ఒడిశాలోని జగత్‌సింగ్‌పూర్‌కు చెందిన 16 ఏళ్ల బాలిక ప్రమోదిని కాలేజీ నుంచి తిరిగి వస్తుండగా ఆమెపై యాసిడ్ దాడి జరిగింది. యాసిడ్ దాడికి గురైన ఆ బాలిక శరీరం 80 శాతం వరకు కాలిపోయి కంటి చూపు కూడా కోల్పోయింది. ఆ అమ్మాయి జీవించాలనే కోరికను కూడా వదిలేసుకుంది. కానీ, దాదాపు 10 సంవత్సరాల తర్వాత ఆమె జీవితంలో ఊహించని సంఘటన జరిగింది. ప్రమోదినిని ప్రేమించి పెళ్లి చేసుకున్న యువకుడు ఆమె జీవితానికి కొత్త వెలుగును పంచాడు. దాంతో ఆమె జీవితమే పూర్తిగా మారిపోయింది. ప్రేమికుల రోజు సందర్భంగా వారు తమ ప్రేమకథను షేర్ చేశారు.యాసిడ్ దాడి నుండి బయటపడిన బాధితురాలు ప్రమోదిని రౌల్ రాణి, సరోజ్ సాహు ప్రేమ వివాహ కథవాస్తవానికి, 14 ఫిబ్రవరి 2018న అంటే వాలెంటైన్స్ డే రోజునే ప్రారంభమైంది. ఆ యాసిడ్ దాడి బాధిత బాలికకు తన ప్రియుడితో నిశ్చితార్థం జరిగింది. ఇద్దరూ మార్చి 1, 2021న వివాహం చేసుకున్నారు. అయితే, యాసిడ్ తర్వాత బాధితురాలు జీవితంలో ఊహించన ఎన్నో ఘటనలు చోటు చేసుకున్నాయి. తీవ్రంగా గాయపడిన రాణి 9 నెలల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అయినప్పటికీ ఆమె కోలుకోలేదు. ఈ క్రమంలోనే వారి తల్లిదండ్రుల వద్ద డబ్బు లేకపోవడంతో కుటుంబసభ్యులు ఆమెను ఇంటికి తీసుకొచ్చేశారు. 5 ఏళ్లుగా తాను మంచానికే పరిమితమైంది.దాదాపు ఐదేళ్ల తర్వాత అంటే 2014లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన బాధితురాలిని చూసుకోవటానికి ఒక నర్సు ఆమె వద్దకు ఒక అబ్బాయిని తీసుకు వచ్చింది. అతనే సరోజ్ సాహు. 2014లో రాణిని కలిసిన సరోజ్.. తరచూ ఆమె పరిస్థితి చూసేందుకు ఆస్పత్రికి వచ్చేవాడు.. డాక్టర్ల సాయంతో సరోజ్ ప్రమోదినిని 4 నెలల్లోనే కాళ్లమీద నిలబడేలా చేశాడు. 2016లో రాణి తన చికిత్స కోసం ఢిల్లీకి వచ్చింది. అక్కడ ఆమెకు సంపూర్ణ చికిత్స ప్రారంభమైంది. కాగా సరోజ్ అప్పుడు ఒడిశాలో ఉండేవాడు. ఆ సమయంలో ఒరిస్సాలో ఉన్న సరోజ్ రాణి వెళ్ళిపోయిన తర్వాత చాలా మిస్ అవుతున్నానని, ఆమె లేకుండా జీవించలేనని తెలుసుకున్నాడు. దాంతో జనవరి 14న సరోజ్ రాణికి ఫోన్ చేసి.. ఆమె ముందు తన ప్రేమను వ్యక్తం చేస్తూ పెళ్లి చేసుకోవాలంటూ కోరాడు.కొంతకాలం తర్వాత, కంటికి శస్త్రచికిత్స చేయించుకున్న ప్రమోదిని కాస్త కోలుకుంది. కంటి చూపు 20 శాతానికి పైగా తిరిగి వచ్చింది. ఆ తర్వాత, రాణి మళ్లీ సరోజ్‌ని పెళ్లి చేసుకోవడానికి అంగీకరించింది. వారిద్దరూ 14 ఫిబ్రవరి 2018న ఒక కేఫ్‌లో నిశ్చితార్థం చేసుకున్నారు. ఆపై మార్చి1, 2021న వివాహం చేసుకున్నారు. ఈరోజు వారిద్దరూ తమ జీవితాల్లో చాలా సంతోషంగా ఉన్నారు. ఈ విషయం తెలిసిన చాలా మంది నెటిజన్లు ఇదే నిజమైన ప్రేమంటే అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీరి ప్రేమకథపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## తెరపైకి రామేశం భూములు

కాకినాడ, ఫిబ్రవరి 14, నియోజకవర్గంలోని రామేశంపేట భూముల విషయమై స్థానిక శాసనసభ్యుడు, మాజీ మంత్రి నిమ్మకాయల చిన్నరాజప్ప వైసీపీ నాయకులతో ఒప్పందం కుదుర్చుకున్నారనే ప్రచారం సాగుతోంది. దీంతో తెలుగు తమ్ముళ్లు కాస్త గుర్రుగా ఉన్నట్లు సమాచారం. దీనికి తోడు పెద్దాపురం సీటు ఈ సారి కమ్మ సామాజిక వర్గానికి ఇవ్వాలనే డిమాండు ఉ ంది. అయితే సీటు తనకేనంటూ చినరాజప్ప ప్రకటించుకున్నారు. ఈ అంశం అధిష్టానానికి కూడా కోపం తెప్పించిందని తెలిసింది.స్థానిక ఎమ్మెల్యే చినరాజప్ప వ్యవహారంతో టీడీపీ నేతలు విసిగిపోయి ఉన్నారు. ఈ నేపథ్యంలో తమ వద్దకే వస్తున్న అధినేతకు పెద్దాపురం వ్యవహారాలన్నింటినీ తెలియజేయాలని తమ్ముళ్లు భావిస్తున్నట్లు సమాచారం. ఇదే జరిగితే తెలుగుదేశం పార్టీకి తీవ్ర నష్టం జరిగే ప్రమాదముందని రాజకీయ నిపుణులు అంటున్నారు.పెద్దాపురం నియోజకవర్గం పరిధిలో రామేశం పేట, సూరంపాలెం, వాలు తిమ్మాపురం, కొండపల్లి, ఆనూరు గ్రామాల పరిధిలో రామేశం మెట్ట పేరుతో 579 ఎకరాల గ్రావెల్ కొండ ఉంది. ఈ భూముల్లో ఎస్సీ కార్పొరేషన్ కింద 429 మంది రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. జీడి మామిడితోట ఉపాధి కల్పన నిమిత్తం ఒక్కో రైతుకు 1.35 ఎకరాలు అందచేశారు.రైతులు గత 42 సంవత్సరాలుగా ఈ భూములను సాగు చేసుకుంటున్నారు. సాలీనా ఒక్కో ఎకరంపై రూ.60 వేల వరకు ఆదాయం పొందుతున్నారు. గతంలో రాజప్ప డిప్యూటీ సీఎంగా ఉన్న సమయంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా వైసీపీ వారితో రాజప్ప కుమ్మక్కు అయినట్లు టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు.రామేశం భూముల వ్యవహారంపై ఇటీవల కాకినాడ మాజీ శాసనసభ్యుడు వనమాడి వెంకటేశ్వరరావు కాకినాడ కలెక్టరుకు ఫిర్యాదు చేశారు.

# బీజేపీ, జనసేన అభ్యర్థిగా మాధవ్...

విశాఖపట్టణం, ఫిబ్రవరి 14, జనసేన తో కలిసి 2024 ఎన్నికలకు వెళు‌తున్నామని బీజేపీ నేత సునీల్ దియోధర్ అన్నారు. విశాఖలో మాట్లాడిన ఆయన... వైసీపీ, టీడీపీ కుటుంబ సభ్యుల పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ను పునర్నిర్మించడం బీజేపీ-జనసేన కూటమికే సాధ్యమన్నారు. బీజేపీ నేత మాధవ్ ను మళ్లీ పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలని సునీల్ దియోధర్ విజ్ఞప్తి చేశారు. ప్రాంతీయ పార్టీలతో రాష్ట్ర, దేశ ప్రయోజనాలకు ఒరిగేదేమీ ఉండదన్నారు. ఏపీలో కుటుంబ పార్టీలు రాజ్యమేలుతున్నాయని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రానికి న్యాయం చేయగలిగేది ఒక్క బీజేపీ జనసేనతో మాత్రమేనని స్పష్టం చేశారు. బీజేపీ-జనసేన మధ్య పొత్తు కొనసాగుతుందని మరోసారి తేల్చిచెప్పారు. వైసీపీ, టీడీపీ విఫల పార్టీలని సునీల్ దియోధర్ విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నట్టు ఎమ్మెల్సీ మాధవ్ తెలిపారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ స్థానాన్ని బీజేపీ గెలుచుకుంటూ వస్తుందన్నారు. పార్టీ ఆదేశాలు మేరకు మరోసారి ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్నానని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో జనసేన పార్టీతో కలసి ముందుకు వెళ్తామన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రులు తమ ప్రాధాన్యత ఓటును వేయవాల్సిందిగా తనకు వేయాలని కోరారు. ఉత్తరాంధ్రలో కేంద్ర ప్రభుత్వం సహాయంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో పెట్టుకున్న ఆశయాలను 100 శాతం పూర్తి చేశామన్నారు. ము. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ను సాధించుకున్నామని తెలిపారు.'ఉత్తరాంధ్రలో ఉన్న 34 నియోజకవర్గాలలో జాతీయ రహదారులను నిర్మించాం. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రకటన వచ్చిన వెంటనే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిని కలిసి సెయిల్ లో కలపమని కోరాం. విశాఖలో ఉన్న పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నాం. విశాఖ అభివృద్ధిలో మా వంతు కృషి చేస్తున్నాం. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉన్న సమస్యలు పరిష్కరంలో కీలకపాత్ర పోషిస్తున్నాం.' - ఎమ్మెల్సీ మాధవ్ బీజేపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాధవ్ పేరు ప్రకటించారు. మాధవ్ అభ్యర్థిత్వాన్ని బీజేపీ ఏపీ సహ ఇన్ ఛార్జ్ సునీల్ దియోధర్ ప్రకటించారు. 2024లోనూ ఇదే పొత్తు కొనసాగుతుందన్నారు. బీజేపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ప్రకటనతో టీడీపీకి గట్టిదెబ్బ తగిలిందంటున్నారు విశ్లేషకులు. జనసేనతో దోస్తీ కట్టేందుకు చూస్తున్న టీడీపీకి పొత్తు సాధ్యపడేలా కనిపించడంలేదని అంటున్నారు. జనసేనతో పొత్తు పెట్టుకుని 2024 నాటి సార్వత్రిక ఎన్నికలకు వెళ్లాలని టీడీపీ ఆశిస్తుంది. కానీ అది అంత సులభం కాదని ఎమ్మెల్సీ ఎన్నికలు స్పష్టం చేస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలకు సెమీ ఫైనల్స్ గా చెబుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ-జనసేన కలిసి పోటీ చేస్తున్నట్లు ప్రకటించాయి. వైసీపీ అభ్యర్థుల ప్రకటనముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా పార్టీ అధ్యక్షులతో జరిగిన సమావేశంలో సీఎం జగన్ ఎమ్మెల్సీ అభ్యర్థులను ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. వైఎస్సార్సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యరులు, వైయస్సార్‌సీపీ మద్దతు ఇస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి కృషిచేయాలని, సమన్వయంతో వారిని గెలిపించాలని సీఎం జగన్ సూచించారు. ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎస్. సుధాకర్, తూర్పు రాయలసీమ జిల్లాల అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, పశ్చిమ రాయలసీమ జిల్లాల అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రనాథ్ రెడ్డి పేరును ఏపీ సీఎం జగన్ ప్రకటించారు. తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎం.వి. రామచంద్రారెడ్డి పోటీ చేస్తారని వెల్లడించారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.వి. రామచంద్రారెడ్డి , తూర్పు రాయలసీమ జిల్లాల పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, పశ్చిమ రాయలసీమ జిల్లాల పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రనాథ్ రెడ్డి, తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎస్. సుధాకర్. 2019 ఎన్నికల్లో 175 అసెంబ్లి స్థానాలకు గాను 151 సీట్లు సాధించిన వైసీపీ శాసన సభలో తిరుగులేని ఆధిక్యతను సొంతం చేసుకుంది. శాసన మండలిలో మెజార్టీ లేకపోవడంతో సీఎం జగన్‌కు తలనొప్పిగా మారింది. ఒకదశలో శాసన మండలిని రద్దు చేయాలనే ప్రతిపాదన చేశారు. తీర్మానం పంపారు. అయితే కేంద్రం ఆమోదించలేదు. కానీ తర్వాత జగన్ తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. పలువురు టీడీపీ సభ్యుల పదవికాలం పూర్తవ్వడంతో వైసీపీ బలం పెరిగిం ది. మండలిలో ఇప్పుడు మెజార్టీ కూడా వైసీపీదే. తాజాగా 23 స్థానాలు భర్తీ కావాల్సి ఉండటం తో శాసన మండలిలోనూ పూర్తిగా వైసీపీ ఆధిక్యత చూపించనుంది. శాసన మండలి లో టీడీపీ ప్రాతినిధ్యం పరిమితం కానుంది.

## మోడీ హాయంలో తగ్గిన తీవ్రవాదం

**మణిందర్ సింగ్ జిత్ బిట్టా**

తిరుమల ఆల్ ఇండియా యాంటీ టెర్రరిజం ఫ్రంట్ చైర్మన్ మణీందర్ సింగ్ జీత్ మంగళవారం శ్రీవారి దర్శనార్థం తిరుమల కి వచ్చారు. దర్శనం తరువాత పద్మావతి అతిథి గృహంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎల్టీటీఈ ప్రభాకరన్ పై తమిళనాడు ప్రభుత్వం స్టాండ్ ఏంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తిరుమలలోని రాధేయం అతిథి గృహంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభాకరన్ గురించి వార్త మొదటిసారి వింటున్నాననీ, ఢిల్లీ వరకూ ఈ వార్త ఇంకా చేరలేదన్నారు. ముందు తమిళనాడు ప్రభుత్వం స్టాండ్ దీనిపైన ఏంటో క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. వాళ్లు ప్రభాకరన్ వారసులుగా ఉండాలి అనుకుంటున్నారా లేదా తీవ్రవాదిని తీవ్రవాదిగానే చూడాలనుకుంటున్నారో చెప్పాలన్నారు. రాజీవ్ గాంధీని చంపేసిన టెర్రరిస్టు భావజాలంతో అక్కడి నాయకులు రాజకీయాలు చేయాలనుకుంటే అది సరికాదన్నారు. తాను కేంద్ర ప్రభుత్వంలోని పెద్దల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానని చెప్పారు. ఈలోగా దీనిపైన తమిళనాడు ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. రాజీవ్ హత్య కేసులో దోషులను విడిచి పెట్టేశారనీ, అది కూడా కరెక్ట్ కాదనీ, ఉగ్రవాదులు, తీవ్రవాదులు ఎన్నేళ్లు శిక్ష అనుభవించినా వాళ్ల భావజాలంలో మార్పు రాదన్నారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో టెర్రరిజం తగ్గుముఖం పట్టిందన్నారు. టర్కీ పాలకులు పాకిస్తాన్ కు అనుకూలంగా ఉన్నా ఆపద సమయంలో ఇండియా మానవత్వంతో టర్కీని ఆదుకుంటోందన్నారు. ఏపీలో జగన్ ప్రభుత్వం మంచి పరిపాలన అందిస్తోందనీ, విశాఖను రాజధానిగా నిర్ణయించడం మంచి పరిణామం అన్నారు. ఏపీ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. నార్కో టెర్రరిజాన్ని అంతమొందించాలంటే విద్యార్థులకు మంచి విద్యను అందించాలని అభిప్రాయపడ్డారు.

## బొత్సకు స్థానచలనం తప్పదా?



అమరావతి ఫిబ్రవరి 14 ఉత్తరాంధ్రా జిల్లాలకు చెందిన బొత్స సత్యనారాయణ బిగ్ పొలిటికల్ ఫిగర్ గా వెలుగొందుతున్నారు. తూర్పు కాపు సామాజికవర్గానికి చెందిన బొత్స ఉత్తరాంధ్రాలో వారికి అసలైన ప్రతినిధిగా ఉంటూ వస్తున్నారు. పెద్ద ఎత్తున ఆ సామాజికవర్గం ఉండడం కూడా ఆయనకు కలసివస్తోంది. ఇదిలా ఉండగా విజయనగరం జిల్లా రాజకీయాల్లో బొత్స చక్రం గిర్రున గత ఎన్నికల్లో తిరిగింది. తన బంధువులకు టికెట్లు ఇప్పించుకోవడమే కాదు మొత్తం తొమ్మిది అసెంబ్లీ సీట్లు ఒక ఎంపీ సీటుని ఆయన వైసీపీ గెలుచుకోవడంలో కీలమైన పాత్ర పోషించారు. బొత్స ఎంపీగా మూడు సార్లు ఎమ్మెల్యేగా దశాబ్దానికి పైగా మంత్రిగా పనిచేశారు. వచ్చే ఎన్నికల్లో ఆయన మరోసారి పోటీ చేయడానికి చూస్తున్నారు. చీపురుపల్లిని ఆయన తన సొంత నియోజకవర్గంగా చేసుకున్నారు. 2004లో ఫస్ట్ టైం ఆయన అక్కడ నుంచి గెలిచారు. 2009లో మరోసారి జెండా ఎగరేశారు. 2014లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి విభజన కారణంగా ఓటమి చవిచూశారు. ఆ తరువాత వైసీపీలోకి మారి 2019లో బంపర్ విక్టరీని సాధించారు. లెక్క ప్రకారం 2024లో ఆయన చీపురుపల్లి నుంచే పోటీ చేయాలి. కానీ అక్కడ బొత్సకు డౌట్ కొడుతోందా అన్న చర్చ అయితే మొదలైంది. బొత్స సేఫ్ జోన్ కోసం చూసుకుంటున్నారు అని అంటున్నారు. చీపురుపల్లిలో టీడీపీ గ్రాఫ్ బాగా పెరిగింది అని అంటున్నారు. అలగే జనసేన కూడా అక్కడ గట్టిగానే ఉందని చెబుతున్నారు. బొత్స ఉంటే అమరావతి లేకుంటీ విజయనగరం అన్నట్లుగా ఉంటున్నారు. తన వారికి చీపురుపల్లి బాధ్యతలు అప్పగించారు. ఈ మధ్యలో వైసీపీ నుంచి చాలా మందిని తెలుగుదేశం లాగేసింది. అక్కడ వచ్చే ఎన్నికల్లో మాజీ మంత్రి కిమిడి మృణాళిని కుమారుడు నాగార్జున పోటీ చేయాలని చూస్తున్నారు. గత ఎన్నికల్లో ఓడిన నాగార్జున గ్రౌండ్ వర్క్ బాగా చేసుకున్నారు. దాంతో పాటు జనసేన కూడా కలిస్తే బొత్సకు ఇబ్బంది అని నివేదికలు వస్తున్నాయట. దాంతో ఆయన చూపు ఎస్ కోట మీద పడింది అని అంటున్నారు. ఎస్ కోట సిట్టింగ్ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఉన్నారు. ఆయన మీద సొంత పార్టీలోనే వ్యతిరేకత ఉంది అంటున్నారు. ఆయన లోకల్ గా ఉండకపోవడం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తీర్చకపోవడంతో సాదర జనాలు పార్టీ జనాలూ కూడా ఆయన పట్ల విముఖంగా ఉన్నారని అంటున్నారు. వైసీపీ సర్వేలలో కూడా అదే తేలడంతో ఆయనకు టికెట్ దక్కడం కష్టమని అంటున్నారు. దాంతో ఆ ప్లేస్ లోకి బొత్స రావాలని చూస్తున్నారు. ఎస్ కోట నుంచి తాను పోటీ చేస్తే బాగుంటుందని ఆయన ఆలోచిస్తున్నారు అని ప్రచారం అయితే సాగుతోంది. మరి ఆయన ఎస్ కోటను ఎంచుకుంటే చీపురుపల్లి నుంచి ఎవరు వైసీపీ తరఫున పోటీ చేస్తారు అన్నది కూడా చూడాలని అంటున్నారు. సీనియర్ మంత్రి తన గెలుపు కోసం వేరే నియోజకవర్గానికి బదిలీ అయితే ప్రత్యర్థి పార్టీలకు ఏ రకమైన సంకేతం ఇస్తున్నట్లు అన్నది చూడాలి. అలాగే అది వైసీపీకి ఇబ్బంది అవుతుందా అన్న చర్చ కూడా ఉంది ఏది ఏమైనా జగన్ చీపురుపల్లి నుంచి బొత్సను పోటీ చేయమంటే ఆయన ఏమి చేస్తారు అన్నది కూడా చూడాల్సి ఉందని అంటున్నారు.

## తణుకులో మెడికల్ మాఫియా

ఏలూరు, ఫిబ్రవరి 14, వైద్యుల వద్దకు వెళ్తే.. ఫీజులు, పరీక్షలు అంటూ డబ్బులు భారీగా వసూలు చేస్తారని.. సామాన్యులు, మధ్యతరగతి వారు దగ్గు, జ్వరం, వంటి సాధారణ రోగాలకు మెడికల్ షాప్స్ దగ్గరకు వెళ్లి.. వారిచ్చిన మందులను తెచ్చుకుని వాడుతారు. అంతేకాదు బ్రాండెడ్ పేరిట నాసిరకం మందులను రోగులకు అంటగడుతూ అడ్డగోలుగా దోచుకునే మెడికల్ షాప్స్ కూడా అనేకం ఉన్నాయి. ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లాలోని ధనార్జనే ధ్యేయంగా మెడికల్ షాపులు ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న మెడికల్ మాఫియా గుట్టురట్టయింది. జిల్లాలోని తణుకులో మెడికల్ మాఫియా గుట్టురట్టైంది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాప్‌ల యజమానులు చేస్తున్న మెడికల్ దందాను అడ్డుకున్నారు జిల్లా అధికారులు. ఎక్స్‌పైరీ అయిన మందులు డేట్ చెరిపేసి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కుల ఆటకట్టించారు. కొంత కాలంగా జిల్లాలో చాప క్రింద నీరులా సాగుతున్న మందుల చీకటి వ్యాపారం జిల్లా ఔషధ నియంత్రణ అధికారుల దాడులతో తీగ లాగితే డొంక కదిలింది. తణుకు లోని వెంకటసాయి మెడికల్ స్టోర్ లో నిషేధిత మందు లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న అధికారులు దాడులు చేసారు. జిల్లాలోని ఐదు మెడికల్ షాపులు, గోడౌన్ లపై దాడులు చేసి 25లక్షల విలువ చేసే నిషేధిత మందులను సీజ్ చేశారు అధికారులు. మత్తు కోసం వినియోగించేల్ప్రాజోలం, సెక్స్ సామర్థ్యం పెంచే వయాగ్రా, గర్భవిచ్ఛిత్తి కోసం వాడే అబార్షన్ కిట్లు పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకొని.. పీఎంపీలు, ఆర్ఎంపి లకు విక్రయిస్తున్న ట్లుగా విచారణలో వెళ్ళడైంది. పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకున్న ఈ మందులపై ఉన్న ఎంఆర్పీలను శానిటైజర్ లో తుడిపేసి అధిక ధరలకు.. హోల్ సేల్ రిటెయిల్స్ షాపులకు సరఫరా చేస్తు న్న ట్లు గుర్తించారు. తక్కు వ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో కొందరు అక్రమార్కులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని గుర్తించారు. మెడికల్ షాప్ యజమానులు విజయవాడ, హైదరాబాద్, బెం గళూ రు ప్రాంతాల్లోని మెడికల్ రిప్రజెంటేటివులు ద్వా రా వీటిని దిగుమతి చేసుకొని ఏజెంట్ల ద్వారా దందా సాగుతుందని తెలుసుకున్నారు అధికారులు. ఏకకాలంలో జిల్లాలోని తణుకు, ఏలూరు, భీమవరంలోని మెడికల్ షాపులపై దాడులు చేసి 9 కేసులు నమోదు చేశారు. మెడికల్ దందాపై ఆరా తీస్తు న్నామని చెప్పారు అధికారులు.

## ఇంకా చికిత్సలోనే తారక రత్న



బెంగళూరు, ఫిబ్రవరి 14,తారకరత్న ఆరోగ్యం మరింత మెరుగుపడింది. బెంగళూరు హృదయాలయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తారకరత్న ఆరోగ్య పరిస్థితిపై గత నాలుగైదు రోజులుగా ఎటువంటి అప్ డేట్స్ రాకపోయినప్పటికీ, నందమూరి కుటుంబ సభ్యుల సన్నిహితుల నుంచి అందిన అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు ఆయన ఆరోగ్య పరిస్థితి మరింత మెరుగుపడిందనీ, చికిత్సకు చక్కగా స్పందిస్తున్నారనీ తెలుస్తోంది. అన్నిటికీ మించి తారక రత్న ఆరోగ్య పరిస్థితికి సంబంధించి ఎప్పటికప్పుడు బాలకృష్ణ వైద్యులతో సంప్రదిస్తున్నారనీ, వైద్యులు కూడా తారకరత్న ఆరోగ్య పరిస్థితి గురించిన అప్ డేట్స్ అన్నీ ఆయనకే తెలియజేస్తున్నారనీ అంటున్నారు. గత నెల 27న చిత్తూరు జిల్లా కుప్పంలో తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్ పాదయాత్రలో పాల్గొన్న తారకరత్నగుండెపోటుకు గురైన సంగతి విదితమే. ఆయనకు మరి కొన్ని పరీక్షలు చేయాల్సి ఉందని, చికిత్సకు తారకరత్న స్పందిస్తున్నారనీ, ప్రస్తుతం ఆయనకు బ్రెయిన్ డ్యామేజీ రికవరీ చికిత్స అందిస్తున్నామనీ గతంలో వైద్యులు తెలిపిన విషయం తెలిసిందే. అలాగే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తారకరత్న పొటో ఒకటి కూడా గతంలో విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ ఫొటోలో తారకరత్న క్లీన్ షేవ్ తో కనిపించారు.

## అనంతలో ఉత్కంఠ భరితంగా రాతి దూలం పోటీలు

అనంతపురంఅనంతపురం జిల్లా గుంతకల్లు మండలంలోని ఎన్ వెంకటం పల్లి గ్రామ సమీపంలో వెలసిన శ్రీ పెద్ద కదిరప్ప స్వామి తిరుణాల సందర్భంగా రాతి దూలం పోటీలు నిర్వహిం చారు ఈ రాతిదూలం లాగుడు పోటిలకు పూజారి రామాంజనేయులు స్వామి శ్రీ గజరాంపల్లి శంకరయ్య స్వామి ఆలయ కమిటీ సభ్యులు పూజా కార్యక్రమం నిర్వహించి రాతిదూలం పోటీలను ప్రారంభించారు ఈ రాతిదూలం పోటీలకు వివిధ మండలాల నుంచి 21 జతల దేశపు ఎద్దులు పాల్గొన్నాయి. రాతిదూలం లాగుడు పోటిలు ఉదయం నుంచి హోరాహోరీగా సాగాయి ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రజలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త అల్లుడికి 108 రకాల వంటకాలు

ఏలూరు కామరపు కోట, పెళ్లయిన అనంతరం తొలిసారి ఇంటికి వచ్చిన తన అల్లుడికి 108 రకాల వంటకాలతో విందును ఏర్పాటు చేశారు కామవరపుకోట సొసైటీ చైర్పర్సన్ సాయిన కనకరాజు ఉమాదేవి దంపతుల కుమార్తె గౌతమికి హైదరాబాద్ పట్టణానికి చెందిన సందేష్ కు ఈనెల తొమ్మిదో తేదీన పెళ్లయింది. ఆదివారం ఇంటికి వచ్చిన నూతన దంపతులు సందేష్ గౌతమిలకు 29 రకాల స్వీట్లు, 5 రకాల బజ్జీలు,15 రకాల జ్యూస్ లు, పలు రకాల పులిహోరలు, బిర్యానీలు, వివిధ రకాల

పిండి వంటలు, శాఖాహార కూరలు, రసం, సాంబారు, ఉలవచారు, పచ్చిపులుసు, మజ్జిగ పులుసు, బూరెలు, గారెలు, అరిసెలు, బొబ్బట్లు, ఏర్పాటు చేసినట్లు సాయిన కనకరాజు తెలిపారు. ఈ సందర్భంగా సందేష్ మాట్లాడుతూ ఉద్యోగరీత్యా అమెరికాలో ఉండే ప్రత్యేకించి పూలతో అడుగులు ఏర్పాటు చేసి స్వాగతం పలికి ఇలా తెలుగు వంటకాలతో గుమగుమలాడే రుచులతో విందు ఏర్పాటు చేయటం చాలా ఆశ్చర్యాన్ని కలగచేసిందని తనకు ఇష్టమైన స్వీట్ లతో పాటు ఉలవచారు, మజ్జిగ పులుసు కూడా ఈ విందులో ఉండటం నాకు అమితానందాన్ని కలగజేస్తుందని ఇటువంటి విందును ఏర్పాటు చేసిన తమ అత్త మామలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఆర్టీసీ బస్టాండ్ల ప్రైవేటీకరణను ప్రతిఘటిస్తాం

**సీపీఎం నగర కార్యదర్శి రామమోహన్**

కడప రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా ఆర్టీసీ బస్టాండ్లను ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు లీజు ప్రాతిపదికన కట్టబెట్టె చర్యలను ప్రతిఘటిస్తామని సిపిఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ తీవ్రంగాహెచ్చరించారు. మంగళవారం నాడు కడప నగరంలోని ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం వద్ద సిపిఎం కడప నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రైవేటీకరణ ప్రయత్నాలను నివసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి రామమోహన్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్లను లీజు పేరుతో 33 సంవత్సరాలు పాటు ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వాలని ఆలోచించడం సరైంది కాదన్నారు. ఆర్టీసీ సంస్థ నిర్వహణలోనూ, గ్యారేజ్ ల ఏర్పాట్లలోనూ, బస్సుల కండిషన్ సమర్ధవంతంగా ఉంచడంలోనూ కీలకమైన పాత్ర పోషిస్తుందన్నారు. అలాంటి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్టిసి బస్టాండ్ లను నిర్వహించడంలో ఇబ్బందులు ఏవి ఎదురయ్యే అవకాశం లేదని ఆయన అన్నారు. అనేక సంవత్సరాలుగా సంస్థ అభివృద్ధి సాధిస్తూ ముందుకు దూసుకోబోతుందని, ఇలాంటి పరిస్థితుల్లో నిర్వహణ పేరుతో ఆర్టీసీ బస్టాండ్లను ప్రైవేటు వ్యక్తులకు, సంస్థలకు కట్టబెట్టాలని ఆలోచించడం సమంజసం కాదని ఆయన అన్నారు. రాష్ట్రంలో మొదటిసారిగా మదనపల్లి ఆర్టీసీ బస్టాండ్ ను కాంట్రాక్ట్ అప్పజెప్పి చర్యలు ప్రారంభిస్తుందన్నారు. ఆ తర్వాత దీన్ని రాష్ట్రమంతా విస్తరించి బస్టాండ్ లన్నిటిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి సిద్ధమవుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆర్టీసీ చైర్మన్ ఇద్దరు కడప జిల్లా వాసులేనని, వీరిద్దరూ లీజు పేరుతో ఆర్టీసీ బస్టాండ్ల ప్రైవేటీకరణ నిలుపుదల చేసేలా చూడాలని, వ్యక్తులకు కట్టబెట్టే విధానాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బస్టాండ్ ల నిర్వహణకు ఆర్టీసీ సామర్థ్యం కలిగి ఉందని, ఆ సామర్థ్యాన్ని వినియోగించి బస్టాండ్లను మెరుగ్గా నిర్వహిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే స్టేషన్లను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడుతోందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆ దిశలో ఆర్టీసీ బస్టాండ్లను చేయాలని చూస్తోందన్నారు. తక్షణమే ఇలాంటి విధానాలకు స్వస్తి చెప్పి బస్టాండ్లను మెరుగైన పద్ధతిలో నిర్వహణ ఉండేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజానీకాన్ని కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలను కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరి రెడ్డి, లోక్సత్తా పార్టీ నేత కృష్ణ, సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రారెడ్డి, ఓబులేసు, ఫారుక్ హుసేన్, మహబూబ్ తార, రాజమణి, కామేశ్వరమ్మ, సరిత, అన్వర్, వెంకటసుబ్బయ్య, ఓబులయ్య, అలీఖాన్, షాకీర్, రియాజ్ , శివ, శశి తదితరులు పాల్గొన్నారు.

## బస్వా నూకరాజు కుటుంబానికి ఐదు లక్షల బీమా అందజేత

**ఇటీవల విద్యుత్ షాక్ ప్రమాదంలో మరణించిన నూకరాజు కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్న జనసేన**

పిఠాపురం పిఠాపురం మండలం చిత్రాడ జనసేన పార్టీ క్రియాశీల కార్యకర్త, మొదట నుండి మెగా ఫ్యామిలీకి అభిమానిగా ఉంటూ జనసేన పార్టీ అభివృద్ధికి కృషిచేసిన కుటుంబానికి 5 లక్షల బీమా చెక్కును జనసేన నాయకులు అందించారు. బస్వా నూకరాజు కి నివాళి అర్పించిన అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షులు కందుల దుర్గేష్, పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జి మాకినీడి శేషుకుమారి, పిఏసి సభ్యులు, బసవా నూకరాజు సభ్యత్వం చేయించిన క్రియాశీలక వాలంటీర్ పెంకే జగదీష్ చేతుల మీదుగా 5 లక్షల రూపాయల బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు దుర్గేష్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తూ ఎవరైనా పార్టీ కార్యకర్తలు గాయపడినా, దురదృష్టవశాత్తు మరణించినా వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే ముందు చూపుతో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గారు పార్టీ క్రియాశీల సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్కరికి బీమా చేయించారని అన్నారు. ఈ కుటుంబానికి అన్ని విధాలుగా జనసేన పార్టీ ఇన్చార్జిలు, నాయకులు, జన సైనికులు అండగా ఉండాలని తెలియజేశారు.

## గొప్ప దార్శనికుడు దామోదరం సంజీవయ్య

కడప ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య బడుగు బలహీన వర్గాల ఉన్నతి కోసం ఎంతో కృషి చేశారని, అతి చిన్న వయసులోనే ముఖ్యమంత్రిగా సాహసోపేత నిర్ణయాలు

తీసుకున్నారని, ఆరు లక్షల ఎకరాల బంజరు భూమిని నిరుపేదలకు పంచారని, సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన, కాపులను బీసీలుగా గుర్తించారని, కార్మికులకు బోనస్ ఏర్పాటు చేశారని, వృద్ధులకు పెన్షన్లు పంపిణీ చేయించే కార్యక్రమం అమలు చేశారని, ఆరోగ్య మంత్రిగా, వాణిజ్య మంత్రిగా, కార్మిక మంత్రిగా ఇలా ఏ పదవిలో ఉన్న ఆ పదవికి వన్నెతెచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా కూడా రెండు పర్యాయాలు పనిచేశారన్నా రు. సంజీవయ్య ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు తో పాటు, బండి జకరయ్య, సత్తార్, మల్లెం విజయభాస్కర్, తిరుమలేష్, గొర్ల శ్రీనివాసులు, శ్యామలాదేవి, చెప్పలి పుల్లయ్య, ప్రసాద్ గౌడ్, కనతల ప్రసాద్, లోకేశ్వరి, వెంకట లక్ష్మమ్మ, రత్నం , పాల్గొన్నారు.

## అమరవీరుల త్యాగాలు మరువలేనివి

కాకినాడ జమ్మూ కాశ్మీర్ లోని పుల్వామాలో జరిగిన ఉగ్ర దాడిలో 40 మంది మన దేశ జవాన్లు అమరులై నాలుగేళ్లు పూర్తయ్యాయని వారి త్యాగాలు ఎన్నటికీ మరువలేమని ఆర్మీ విశ్రాంతి ఉద్యోగి ఎస్. శ్రీ నగేష్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన అమరవీరుల త్యాగాల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడారు.

జమ్మూ నుంచి శ్రీనగర్ కు 2019 ఫిబ్రవరి 14న 2500 మందికి పైగా సి ఆర్ పి ఎఫ్ జవాన్లు ప్రయాణం చేస్తుండగా ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడి చేశారన్నారు. దానికి ప్రతీకారంగా ఉగ్రవాద శిక్షణా శిబిరాలపై మన దేశ వాయుసేన దాడి చేసి పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులను హతమార్చిందని శ్రీ నగేష్ తెలిపారు. అనంతరం దేశం కోసం ప్రాణత్యాగం చేసిన జవాన్ల ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, రాజా, రాఘవరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## దళిత జన భాంధవుడు ....దామోదరం సంజీవయ్య

### జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఎం సుధాకర్ బాబు

కర్నూల్ ప్రతినిధి.. దళిత జన బాంధవుడు శ్రీ దామోదరం సంజీవయ్య గారని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ ఎం సుధాకర్ బాబు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన స్వర్గీయ శ్రీ దామోదరం సంజీవయ్య గారి 102 వ జయంతి సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. శ్రీ దామోదరం సంజీవయ్య గారు నలుగురు ప్రధానమంత్రుల క్యాబినెట్లో మంత్రిగాను రెండుసార్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాను రాష్ట్ర ముఖ్యమంత్రిగా అత్యున్నత పదవులు అలంకరించారని ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బీసీలకు రిజర్వేషన్లు కల్పించాడని ఆయన నీతి నిజాయితీకి కట్టుబడి పని చేశారని ఆయన ఎలాంటి ఆస్తులు సంపాదించలేదని అలాంటి మహోన్నత వ్యక్తి కర్నూలు జిల్లాలో పుట్టడం మనందరికీ గర్వకారణమని రాష్ట్రంలో పరిపాలన ప్రాంతీయ పార్టీలతో చేతగావడం లేదని ప్రజలు తిరిగి జాతీయ పార్టీ కాంగ్రెస్ వైపు చూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వస్తే వంటగ్యాస్ సిలిండర్ 500 రూపాయలకే ఇస్తామని రాహుల్ గాంధీ గారు హామీ ఇచ్చారని రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి పాలన గాడి తప్పిందని అధికార వైసిపి పార్టీ చేస్తున్న దాడులను ప్రజలు గమనిస్తున్నారని వైసీపీ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందని రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడంలో విఫలమైందని ఏ పథకమయినా గ్రామాల్లో అధికార పార్టీ నాయకులకు కార్యకర్తలకు మాత్రమే చేరుతున్నాయని సామాన్య ప్రజలకు అందడం లేదని గ్రామాల్లో రాచరిక పాలనను తలపిస్తోందని తెలియజేశారు. ముందుగా శ్రీ దామోదరం సంజీవయ్య గారి 102 వ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయం ముందుగల శ్రీ దామోదరం సంజీవయ్యగారి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం పార్టీ కార్యాలయంలో చిత్ర పటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం డిసిసి అధ్యక్షులు ఎం సుధాకర్ బాబు అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గుప్త ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్ బజారన్న డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ అమరేందర్ రెడ్డి సిటీ మైనారిటీ సెల్ చైర్మన్ ఖాజాహుస్సేన్, సిటీ మహిళా అధ్యక్షురాలు ఎస్ ప్రమీల, ఎస్సీ సెల్ డబ్ల్యు సత్యరాజు, కే వెంకట రెడ్డి, సాంబ శివుడు, బివి సుబ్రహ్మణ్యం శివానంద్, అభి నాయుడు వసిం బాషా, రియాజ్, ఐ ఎన్ టి యు సి జేమ్స్, గోవిందు, కె ఆనందం, బిటి స్వామి, మహిళా కాంగ్రెస్ ఎస్ సారమ్మ కే వెంకటలక్ష్మి ప్రభావతి అరుణ ఎల్లమ్మ, మద్దమ్మ, మొదలైన వారు పాల్గొన్నారు.



# ప్రశ్నించే గొంతుకలను గెలిపించండి

### టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహా రెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు లను చట్ట సభలకు పంపుదాం

### ఏఐఎస్ఎఫ్ ఏఐఎస్ఎఫ్,ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లో ప్రచారం


ఎమ్మిగనూరు ,ఎమ్మిగనూరు పట్టణంలో మార్చి లో జరగబోయే టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహా రెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు ను అత్యధిక మెజార్టీ తో గెలిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు విజేంద్ర, ఏఐఎస్ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జున కోరారు. సోమవారం నందవరం మండలంలో ముగితి, కనకవీడు, మాచాపురం, ఇబ్రహీంపురం,కైరవాడి,పెద్దకొత్తిలి, వివిధ గ్రామాల్లో విద్యాసంస్థలు ల్లో ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేసిందని అన్నారు. సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పి,అధికారంలోకి వచ్చాక సిపిఎస్ రద్దు చేయాలని పోరాడే ప్రభుత్వ ఉద్యోగుల పై ఉక్కుపాదం మోపి, లాఠీ ఛార్జీలు, అక్రమ కేసులు బనాయించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వీటన్నింటినీ ప్రశ్నించే గొంతుకలను కూడా నొక్కుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.కత్తి నరసింహా రెడ్డి గారు ఉపాధ్యాయుల,అధ్యాపకుల ఎదుర్కొంటున్న సమస్యలను నిరంతరం చట్ట సభల్లో గళమెత్తారని అన్నారు. పోతుల నాగరాజు గారు అనేక ఉద్యమాలకు సారథ్యం వహించారని అన్నారు.కావున ప్రశ్నించే గొంతుకలు కత్తి నరసింహారెడ్డి పోతుల నాగరాజులకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి వేయించి చట్టసభలకు పంపించాలని వారు కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు విజయ్ కుమార్, రవి, కిరణ్, దస్తగిరి, మల్లి, తదితరులు పాల్గొన్నారు

## మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైన బోడబండ పుణ్యక్షేత్రం... ధర్మకర్త అప్పా వేణు









తుగ్గలి:మండల పరిధిలోని గల ఉప్పర్ల గ్రామ సమీపంలోని బోడబండలో వెలసిన శ్రీ పకీరప్ప గురు స్వాములు,శ్రీ ఎల్లప్ప గురు స్వాములు మరియు శ్రీ ఆంజనేయులు తాత వారి మహాశివరాత్రి ఉత్సవ వేడుకలు ఫిబ్రవరి 18వ తేదీ నుండి ప్రారంభమవుతాయని,మహాశివరాత్రి వేడుకలకు సంబంధించి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని ఆలయ ధర్మకర్త అప్పా వేణు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18వ తేదీ శనివారము ఉదయం శ్రీ అప్పా చంద్రశేఖర్ గారి ఇంటి నుండి స్వామివారి ఆభరణములు శ్రీ పక్కీరప్ప స్వామి దేవస్థానమునకు చేరుతాయని,శనివారము సాయంత్రం శ్రీ బోడబండ పక్కిరప్ప స్వామి,శ్రీ యల్లప్ప స్వామి గారి ఉత్సవమూర్తులు అప్పా సంజీవులు,అప్పా రవి,అప్పా లక్ష్మి నారాయణ గార్ల ఆధ్వర్యమున అప్పా వెంకటరాముని ఇంటి నుండి ఊరేగింపు జరిగిన పిమ్మట బోడబండ దేవస్థానమునకు చేరుతాయని తెలియజేశారు.19వ తేదీ ఆదివారము ఉదయం 8-00 గం.లకు శ్రీ పక్కీరప్ప స్వామి,శ్రీ యల్లప్ప స్వామి,శ్రీ ఆంజనేయులు తాత ఉత్సవమూర్తులు అప్పా నారాయణ స్వామి ఆధ్వర్యమున గంగా స్నానం నిర్వహిస్తారని,అనంతరం 11-00 గం.ల నుండి పెరవలి గ్రామము గవ్వల గురునాథము,మొగలగవెల్లి గ్రామ వాస్తవ్యులు శ్రీ రంగన్న తాత,శ్రీ పక్కీరప్ప తాత భక్తాదులు మరియుహైదరాబాద్ శ్రీరాములు గార్లచే అన్నదాన కార్యక్రమము జరుగునని,ఆదివారం సాయంత్రం 5-00 గం.లకు శ్రీ పక్కీరప్ప స్వామి, శ్రీ యల్లప్ప స్వామి శ్రీ ఆంజనేయులు తాత గార్ల రథోత్సవము శ్రీ అప్పా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరుగుతుందని వారు తెలియజేశారు.రాత్రి 8-00 గం.లకు శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి నాటక ప్రదర్శన జరుగుతుందని ఆలయ ధర్మకర్త అప్పా వేణు తెలియజేశారు.21వ తేదీ మంగళవారము శ్రీ స్వామి వారి హుండి అప్పా వేణు (ధర్మకర్త), అప్పా నారాయణ స్వామి, అప్పా సత్యన్న,అప్పా వెంకట రాముడు, అప్పా వెంకటేశ్,అప్పా సురేష్ గార్ల ఆధ్వర్యంలో లెక్కించబడునని ఆలయ ధర్మకర్త అప్పా వేణు తెలియజేశారు.మహాశివరాత్రి వేడుకలకు భక్తాదులందరు విచ్చేసి శివరాత్రి వేడుకలను విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త అప్పా వేణు తెలియజేశారు.

## టూరిస్టు పోలీసు కియోస్క్ ప్రారంభం

విశాఖపట్నం ఏపీ పోలీస్ శాఖలో విప్లవాత్మక మార్పులకు ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.ప్రజల పరిపాలన సౌలభ్యం కోసం చర్యలు చేపడుతున్న సర్కారు తాజాగా టూరిస్ట్ పోలీస్ కియోస్కాను ప్రవేశపెట్టింది.సిటీ పోలీస్.. ఏఆర్ పోలీస్... టాస్క్‌ఫోర్స్.. రైల్వే పోలీస్..సరసన కొత్తగా టూరిస్టు పోలీస్ ను చేర్చింది.ఈ వ్యవస్థను ఏపీ సిఎం జగన్ వర్చువల్‌గా ప్రారంభించారు.దీంట్లో బాగంగా విశాఖ ఆర్కేబీచ్ వద్ద ఏర్పాటు చేసిన టూరిస్టు పోలీస్

సెంటర్ సేవలను ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.ఆహ్లాదరబరిత వాతావరణంలో ఏర్పాటు చేసిన టూరిస్టు పోలీస్ కియోస్కాలో విదులు నిర్వర్తించే సిబ్బంది ప్రజలకు అవసరమైన సమాచాన్ని అందిస్తారు.నిరంతరం ఈ కియోస్కా ద్వారా కార్యకలాపాలు కొనసాగేలా సాంకేతిక పరిజ్ఞానం తో కియోస్కాను సిద్ధం చేశారు.24/7విధులు నిర్వర్తించేలా బీచ్ లైఫ్ గార్డ్ ల తో పాటు 10 ద్విచక్రా వాహనాలు,2 ట్రాక్టర్స్ ను కూడా ఏర్పాటు చేశారు.విశాఖకు వచ్చే పర్యటకులకు పూర్తి స్థాయిలో భద్రతకు భరోసా ఇచ్చేలా కియోస్కోన్ సిబ్బందికి సీపీ శ్రీకాంత్ పలు సూచనలు చేశారు.అనంతరం కియోస్కాను పరిశీలించారు.

## కాలనీల్లో తీరిన నీటి కష్టాలు

### సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలి

### సర్పంచ్ పాల్ దినకర్



కౌతాళం: కాలనీలో నీటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని గ్రామ సర్పంచ్ పాల్ దినకర్ తెలిపారు. మంగళవారం 9వ వార్డ్ జంగల్ కాలనీ ఉప్పరి కాలనీలోనే లో ఉన్న నీటి సమస్య నిమిత్తము దేశాయ్ ప్రహల్లాద్ ఆచారి ఆధ్వర్యంలో సర్పంచ్ చెడిపోయిన బోర్లను బాగు చేయించారు. హ్యాండ్ బోర్ పంపు ప్రారంభించారు. కానీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకుని వస్తే ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సక్కరీ తిక్కయ్య వైస్ ఎంపీపీ బుజ్జీ స్వామి, మాజీ ఎంపీటీసీ సౌద్రి బసవ , మాజి సర్పంచ్ అవతారం హై స్కూల్ చైర్మన్ వడ్డే రామన్న, ఉమాపతి, వార్డ్ మెంబర్ రామక్రిష్ణ, సైమన్, చిన్నజంబయ్య, పెద్ద జంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణానది యాజమాన్యం బోర్డును కర్నూల్ లో ఏర్పాటు చేయాలి

### రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ అప్పర్ భద్ర ప్రాజెక్టుతో రాయలసీమ రైతులకు తీవ్ర నష్టంప్రాంతాల మధ్య చిచ్చు పెడుతున్న బిజెపి ..... ఆర్ ఏ వి ఎఫ్

నందవరం మండల పరిధిలో తహసిల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో నిత్యానంద రాజు రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతూ రాయలసీమకు తీవ్ర అన్యాయానికి గురి చేసే కర్ణాటకలోని అప్పర్ భద్ర ప్రాజెక్టుకు ఆమోదం తెలపడం దారుణం అన్నారు, కృష్ణ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు లేకుండా బిజెపి కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా జాతీయ జల సంఘం అనుమతులతో పాటు కేంద్ర హోదా కల్పించి సుమారు 5300 కోట్లతో ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వడం రాయలసీమను రెండు తెలుగు రాష్ట్రాల రైతాంగాన్ని ఎడారిగా చేయడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు మరియు రాయలసీమలోని ప్రాజెక్టులకు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించి ఆర్డీఎస్ వేదవతి గుండ్రేవుల ప్రాజెక్టులను నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అలాగే కృష్ణానది యాజమాన్యం కర్నూల్లో ఏర్పాటు చేయాలని కృష్ణా నదిపై సంగమేశ్వరం వద్ద తీగల వంతెనకు బదులుగా బ్రిడ్జి కం బ్యారేజీని నిర్మించాలని రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు పార్టీలకు అతీతంగా అప్పర్ భద్ర ప్రాజెక్టును అడ్డుకోకపోతే భవిష్యత్తులో రాయలసీమ పశ్చిమ ప్రాంతం తీవ్ర కరువును ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, గోవిందు ,వెంకటేశు ,పాల్గొన్నారు.

# కిరణ్ అబ్బవరానికి అండగా అఖిల్.. ప్లస్ అయ్యేనా!

యువ హీరో కిరణ్ అబ్బవరం కశ్మీరా పరదేశి హీరో హీరోయిన్లుగా నటిస్తోన్న తాజా చిత్రం వినరో భాగ్యము విష్ణు కథ. ఈ చిత్రం రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కింది. ఇప్పటికే విడుదలైన సాంగ్స్ టీజర్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఇక ఈ చిత్రం దాని సెన్సార్ ఫార్మాలిటీలను కూడా పూర్తి చేసేసుకుంది. ఇక ఈ చిత్రం ఫిబ్రవరి 18న మహాశివరాత్రికి ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే శివరాత్రికి విడుదల కావాల్సిన సమంత శాకుంతలం



విశ్వక్ సేన్ ధమ్కీ సినిమాలు పోస్ట్ పోన్ అయ్యాయి. తాజాగా వినరో భాగ్యము విష్ణుకథ రిలీజ్ డేట్ మారడం టాలీవుడ్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.కిరణ్ అబ్బవరం నటించే ప్రతి సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద మినిమం గ్యారెంటీ మూవీగా నిలుస్తుందడనంలో సందేహం లేదు. ఈ హీరో నటించే సినిమాలకు సగటు ప్రేక్షకులు ఎక్కువగా వస్తుంటారు. ఈయన తాజా చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేసింది. ఈ సినిమా పోస్టర్స్ మొదలుకొని టీజర్ ట్రైలర్ల వరకు ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో సక్సెస్ అయ్యాయనే చెప్పాలి.అయితే విడుదల తేదీ దగ్గర పడటంతో.. మేకర్స్ ప్రచార పర్వాన్ని వేగవంతం చేశారు. ఇక ఈ సినిమా ప్రి రిలీజ్ ఈవెంట్ను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఇక ఈ వేడుకకు కుర్ర హీరో అఖిల్ అక్కినేని ముఖ్య అతిథిగా రానున్నారని తెలుస్తోంది. కిరణ్ అబ్బవరానికి అండగా.. ఈ కుర్ర హీరో నిలవనున్నారు. అయితే అఖిల్ కెరియర్లో సరైన హిట్స్ కూడా లేవు. కాకపోతే.. కాస్త ఫ్యాన్ ఫాలోయింగ్ అయితే ఉందనే చెప్పాలి. అంతగా క్రేజ్ లేని హీరో.. ఈ సినిమా ప్రిరిలీజ్కు ఎంత వరకు ప్లస్ అవుతాడో చూడాలి.ఇక ఈ సినిమాకు సంబంధించి విడుదలైన థియేట్రికల్ ట్రైలర్ సినీ ప్రేమికులను ఆకట్టుకుంటోంది. ప్రీ రిలీజ్ బజ్ చాలా పాజిటివ్గానే ఉంది. నూతన దర్శకుడు మురలీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించాడు. మురలీ శర్మ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్ బ్యానర్పై బన్నీ వాస్ నిర్మించారు. ఇక చూడాలి ఈ సినిమా ఏ మేరకు ఆకట్టుకుంటుందో అని.

# మెగాస్టార్ కి కథలు కరువు అయ్యాయా?

మెగాస్టార్ చిరంజీవి హీరోగా ప్రస్తుతం భోళా శంకర్ రూపొందుతోంది. ఆచార్య.. గాడ్ ఫాదర్.. వాల్తేరు వీరయ్య సినిమా లు బ్యాక్ టు బ్యాక్ ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఆచార్య డిజాస్టర్ అవ్వగా గాడ్ ఫాదర్ పర్వాలేదు అనిపించుకుంది.. వాల్తేరు వీరయ్య మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. భోళా శంకర్ పరిస్థితి ఏంటా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.ముందుగా అనుకున్న ప్రకారం భోళా శంకర్ ఇప్పటికే పూర్తి అయ్యి వెంకీ కుడుముల దర్శకత్వంలో ఒక సినిమాను చిరంజీవి మొదలు పెట్టాల్సి ఉంది. కానీ వెంకీ కుడుముల రెడీ చేసిన స్క్రిప్ట్ విషయంలో చిరంజీవి అసంతృప్తి వ్యక్తం చేశారని.. రెండు మూడు వర్షన్ లు తీసుకు వచ్చినా కూడా చిరంజీవి ఓకే చేయలేదని వార్తలు వస్తున్నాయి.చిరంజీవి పై ఆశలు వదిలేసుకున్న వెంకీ కుడుముల ప్రస్తుతం నితిన్ హీరోగా సినిమాను చేసేందుకు రెడీ అవుతున్నాడట. మరో వైపు సందీప్ వంగ కూడా చిరంజీవితో సినిమాను చేయాలని ప్లాన్ చేస్తున్నట్లుగా వార్తలు వచ్చాయి. కానీ ఆయన చేస్తున్న సినిమాలు చాలానే పెండింగ్ లో ఉన్నాయి. కనుక చిరుతో వెంటనే సందీప్ వంగ సినిమా ఉండక పోవచ్చు.మెగాస్టార్ ఇమేజ్ కి మరియు వయసుకు తగ్గ కథలు దొరకడం లేదట. దాంతో రీమేక్ ల వైపు చిరంజీవి మొగ్గు చూపిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. అతి త్వరలోనే చిరంజీవి మరో సినిమాను కమిట్ అవ్వాల్సి ఉంది. అది ఏంటీ అనేది తెలియాలి అంటే మరి కొన్నాళ్లు వెయిట్ చేయాల్సిందే.చిరంజీవి హీరోగా రూపొందుతున్న భోళా శంకర్ సినిమా ఇదే ఏడాది సమ్మర్ చివర్లో లేదా దసరాకు ముందు విడుదల అయ్యేలా ప్లాన్ చేస్తున్నారు. కనుక చిరంజీవి వెంటనే కొత్త సినిమాకు కమిట్ అవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు. రెండు మూడు రీమేక్ ప్రాజెక్ట్ లను కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.



# 'సార్' యంగ్ డైరెక్టర్ ని గట్టెక్కిస్తాడా?

గత కొంత కాలంగా మన హీరోలంతా పాన్ ఇండియా సినిమాల వెంట పరుగులు తీస్తుంటే తమిళ హీరోలు మాత్రం మన టాలీవుడ్ డైరెక్టర్ల వెంట పడతున్నారు. ఒకేసారని బై లింగ్వల్ అంటూ తమిళ తెలుగు భాషల్లో సినిమాలు చేస్తూ రెండు రాష్ట్రాల్లో తమ మార్కెట్ ని విస్తరించుకునే పనిలో పడ్డారు.



ఇప్పటికే దళపతి విజయ్ వంటి స్టార్స్ తెలుగు దర్శక నిర్మాతలతో కలిసి భారీ సినిమాలు చేసిన విషయం తెలిసిందే. ఇదే పంథాలో మరో తమిళ హీరో శివ కార్తికేయన్ కూడా తమిళ తెలుగు భాషల్లో 'ప్రిన్స్' మూవీ చేశాడు.'జాతిరత్నాలు' ఫేమ్ అనుదీప్ కె.వి దర్శకత్వం వహించాడు. భారీ అంచనాల మధ్య తమిళ తెలుగు భాషల్లో విడుదలైన ఈ మూవీ రెండు భాషల్లోనూ ఫ్లాప్ అనిపించుకుని అనుదీప్ కు గట్టి షాకిచ్చింది. ఇక ఇదే తరహాలో దళపలి విజయ్ నటించిన 'వారీసు' తమిళంలో బ్లాక్ బస్టర్ హిట్ అనిపించుకుని తెలుగులో 'వారసుడు'గా విడుదలై ఎలాంటి ప్రభావాన్ని చూపించలేకపోయింది. కానీ తమిళంలో మాత్రం భారీ వసూళ్లతో పాటు బ్లాక్ బస్టర్ అనిపించుకోవడంతో వంశీ పైడిపల్లి ఇక్కడ ఫెయిలైనా అక్కడ పాసయ్యాడు.ఇప్పుడు ఇదే తరహాలో మరో దర్శకుడు వెంకీ అట్లూరి తమిళ హీరో ధనుష్ తో చేసిన మూవీ 'సార్'. తమిళంలో 'వాతి'గా రూపొందిన ఈపొందిన ఈ సినిమా ఫిబ్రవరి 17న విడుదల కాబోతోంది. ఒకేసారి తమిళ తెలుగు భాషల్లో రిలీజ్ కానున్న ఈ మూవీపై యంగ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి భారీ అంచనాలే పెట్టుకున్నాడు. రొటీన్ స్టోరీతో కాకుండా ఎడ్యుకేషన్ మాఫియా నేపథ్యంలో ఈ మూవీని ధనుష్ మార్కు సినిమాగా తెరకెక్కించారు.సందేశాన్ని జోడించి కమర్షియల్ అంశాల నేపథ్యంలో ఈ సినిమాని తెరకెక్కించారు. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇలాంటి కథతో సక్సెస్ కొట్టడం చాలా కష్టం. పైగా ఈ మూవీ గత కొన్ని నెలలుగా వరుసగా వాయిదాల మీద వాయిదాలు పడుతూ వస్తోంది. ఫైనల్ గా ఫిబ్రవరి 17న రిలీజ్ కాబోతోంది. టీజర్ ట్రైలర్ ఆసక్తికరంగానే వున్నా సినిమాకు కావాల్సినంత బజ్ లేకపోవడం ప్రధాన మైనస్ గా మారింది. సినిమా రిలీజ్ కు మరో నాలుగు రోజులు మాత్రమే వుంది.అప్పటికి బజ్ క్రియేట్ అయితేనే ప్రేక్షకులు థియేటర్లకు వస్తారు. అలా వస్తే బొమ్మ బ్లాక్ బస్టరే. కానీ అది జరక్కపోతే మాత్రం చేదు అనుభవం ఎదుర్కోక తప్పదని ట్రేడ్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ధనుష్ సినిమాలకు తెలుగులో మంచి ఆదరణ వున్న విషయం తెలిపిందే.అయితే 'సార్' విషయంలో మాత్రం పెద్దగా బజ్ కనిపించకపోవడం ట్రేడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే బలమైన కంటెంట్ తో వస్తున్న ధనుష్ ఈ మూవీతో యంగ్ డైరెక్టర్ వెంకీ అట్లూరిని గట్టెక్కిస్తాడా? అన్నది వేచి చూడాల్సిందే.

## 'షమీపై మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు.. 200 శాతం అలాంటి పని చేయడని చెప్పా'



మహ్మద్ షమీ.. ప్రస్తుత భారత జట్టులో కీలక పేసర్గా కొనసాగుతున్నాడు. తాజాగా ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లో కూడా షమీ అద్భుత ప్రదర్శన కనబరిచాడు.అయితే షమీ తన క్రికెట్ కెరీర్‌తో పాటు తన వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాడు. ముఖ్యంగా 2018లో షమీపై అతడి మాజీ భార్య హసీన్ జహాన్ గృహ హింస కేసును పెట్టింది. దీంతో ఒక్క సారిగా షమీ వార్తల్లో నిలిచాడు.అదే విధంగా షమీ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డంటూ ఆమె తీవ్రమైన ఆరోపణలు చేసింది. దీంతో బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం దర్యాప్తు కూడా చేపట్టింది. అయితే ఆరోపణలు అవాస్తమని యాంటీ కరప్షన్ విభాగం కొట్టపారేసింది. తాజాగా ఇదే విషయంపై భారత వెటరన్ పేసర్ ఇషాంత్ శర్మ ఆసక్తికర వాఖ్యలు చేశాడు.క్రిక్‌బజ్ షో 'రైజ్ ఆఫ్ న్యూఇండియా' లో ఇషాంత్ మాట్లాడుతూ.."షమీ మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణల గురించి అవినీతి నిరోధక విభాగం హెడ్ నీరజ్ కుమార్ మా జట్టు సభ్యులందరినీ విచారించారు. పోలీసులు అడిగినట్లే అన్ని విషయాలు మా దగ్గర తెలుసుకున్నారు.అదే విధంగా షమీ వ్యక్తిగత విషయాలు గురించి నన్ను ప్రశ్నించారు. అయితే అతడి వ్యక్తిగత విషయాలు గురించి నాకు తెలియదు అని బదులు ఇచ్చాను. కానీ నా వరకు అయితే షమీ 200 శాతం అలాంటి పని చేయడని చెప్పాను. ఈ విచారణ తర్వాత షమీతో తన అనుబంధం మరింత బలపడింది" అని అతడు పేర్కొన్నాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**